ANN తెలుగు

Follow: @ANNTELUGU

17-10-2026

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 254 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఏపీలో మొదలైన ఎన్నికల హింస

- పుంగనూరు, రాయచోటిలో టీడీపీ, వైసీపీ పరస్పర దాడులు
- గాల్లోకి కాల్పులు జరిపిన పోలీసులు
- రాళ్లదాడిలో పలు వాహనాలు ధ్వంసం
- ఎస్ఎన్ కాలనీలో వాహనాలకు నిప్పు

**పుంగనూరు/ రాయచోటి, మహా :** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల తొలిరోజే తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అన్నమయ్య జిల్లా పుంగనూరు, రాయచోటిలలో నామినేషన్లు దాఖలు చేసేందుకు వైఎస్సార్‌సీపీ, టీడీపీ వర్గాలు ఒకేసారి నామినేషన్ కేంద్రానికి వెళ్తుండగా ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ క్రమంలో ఇరుపక్షాలు ఒకరిపై ఒకరు రాళ్లదాడికి దిగడంతో పరిస్థితి అదుపుతప్పి రణరంగంగా మారింది. ఈ దాడిలో పలు వాహనాల అద్దాలు

మిగతా 3వ పేజీలో

టాప్ న్యూస్

### ఇది ప్రభుత్వాన్ని మార్చే కుట్ర : బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్



02

### యూనిఫామ్‌లో డ్యాన్స్‌లొద్దు పోలీసుల రీల్స్‌పై డీజీపీ సీరియస్..

- పోలీసు యూనిఫామ్ గౌరవం కాపాడాలి
- ఉల్లంఘిస్తే క్రమశిక్షణా చర్యలు: డీజీపీ సీవీ ఆనంద్



02

### ఖైరతాబాద్ ఉపఎన్నికలో బలమైన అభ్యర్థిని నిలబెడతాం

- తెలంగాణ రక్షణసమితి అధినేత కవిత



02

## కరువుపై సర్కారు కదం

ఎల్ నినో ను ఎదుర్కొనేందుకు వ్యూహం

సీఎం రేవంత్ ఆదేశాలతో ఉమ్మడి జిల్లాలకు సీనియర్ ఐఏఎస్ లు



- జలవనరులను ప్రణాళిక ప్రకారం వినియోగించుకునే వ్యూహం
- ఇంకో 8 మాసాలు జాగ్రత్తగా ఉండేందుకు కార్యాచరణ

**హైదరాబాద్, మహా :** కరువును ఎదుర్కొనేందుకు సర్కారు సమాయత్తమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించడంతో పాటు వచ్చే వర్షాకాలం దాకా కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు, ఉన్న నీటివనరులను ప్రణాళిక ప్రకారం వాడుకునేందుకు కార్యా,రణ రూపొందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో సీఎస్ కార్యాచరణ ప్రారంభించారు. రాష్ట్రంలో ఎల్‌నినో కారణంగా ప్రతికూల సీజనల్ పరిస్థితుల నేపథ్యంలో పది ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారులను

మిగతా 2వ పేజీలో



### హైదరాబాద్‌లో హ్యుందాయ్ కార్ల తయారీ ప్లాంట్

- ఏర్పాటు చేయాలని కోరిన సీఎం రేవంత్ రెడ్డి
- జహీరాబాద్‌లో రూ.8,528 కోట్లతో గ్లోబల్ ఆర్అండ్‌డీ కేంద్రం
- త్వరలోనే భూమిపూజకు సిద్ధం
- తెలంగాణలో తయారీ రంగానికి అన్ని విధాలా సహకరిస్తాం: సీఎం

02

### అనిరుధ్-కావ్య మారన్ వివాహం

- నవంబర్ 21న చెన్నైలో జరగనున్న రిసెప్షన్
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించిన కళానిధి మారన్ దంపతులు

03



### రణరంగ..సీమ

నామినేషన్ల తొలిరోజే.. యుద్ధ వాతావరణం

04



## స్నేహిత బిల్డర్ల అరాచకం...!

### పీరం చెరువు బఫర్ దురాక్రమణ..!

నాడు అక్రమం .. నేడు సక్రమమా..!

ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే అక్రమాలు...!

హైడ్రా బాస్ స్పందించాలంటున్న స్థానికులు...!

02

చెరువులు, నాలాలు, కుంటలను పరిరక్షించేందుకు ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పీరం చెరువు బఫర్ జోన్ ఆక్రమణల వ్యవహారంలో స్నేహిత బిల్డర్స్ తీరుపై తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనే ఈ వ్యవహారంపై అక్రమ నిర్మాణాలు, ఇరిగేషన్ నిబంధనల ఉల్లంఘనలపై వార్తలు వెలువడినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు పరిధిలోని భూముల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారనే ఆరోపణలతో పాటు, ఇరిగేషన్ శాఖ నుంచి ఎన్‌వోసీ ఎలా జారీ అయింది? రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ ఎక్కడుంది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యమా.. లేక అక్రమాలకు అండదండలా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ఫిర్యాదులు అందినా చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు మరింత చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటికైనా హైడ్రా ఉన్నతాధికారులు స్పందించి, పీరం చెరువు బఫర్ జోన్ హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అనుమతుల జారీపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలు నిర్ధారణైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎల్లంపేటలో అక్రమార్కుల అరాచకం..!

- లోకాయుక్త ఆదేశాలు సైతం బేఖాతరు...!
- గట్సర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ / అరుణ గోదాంపై చర్యలకు మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు ..!
- మున్సిపల్ నిబంధనలకు తూట్లు.. సీజ్ చేసినా మారని తీరు..!
- అటువైపు కన్నెత్తి చూడని టౌన్ ప్లానింగ్ అధికారులు..!
- టీం ఫర్ గుడ్ గవర్నన్స్ తరపున సీడీఎంఏకు చేరిన ఫిర్యాదులు.. అయినా చర్యలు శూన్యం..!
- గోదాం నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలంటున్న టీం ఫర్ గుడ్ గవర్నన్స్ ..!

02

### సీజ్ చేసిన గోదాంలో యథేచ్ఛగా వ్యాపార కార్యకలాపాలు..!



ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు, నిబంధనల ఉల్లంఘనలపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ నిబంధనలను, ప్రభుత్వ ఉత్తర్వులను, బేఖాతరు చేస్తూ గట్సర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ / అరుణ గోదాంలో కార్యకలాపాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. అధికారులు సీజ్ చేసిన గోదాం కొద్ది గంటల వ్యవధిలోనే తిరిగి తెరుచుకుని వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తుండటంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. లోకాయుక్త ఆదేశాలు సైతం అమలుకు నోచుకోవడం లేదంటూ టీం ఫర్ గుడ్ గవర్నన్స్ సభ్యులు మండిపడుతున్నారు. ఈ వ్యవహారంపై టీం ఫర్ గుడ్ గవర్నన్స్ తరపున సీడీఎంఏకు ఫిర్యాదులు అందినప్పటికీ, సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సీజ్ చేసిన భవనంలో తిరిగి కార్యకలాపాలు ఎలా కొనసాగుతున్నాయనే అంశంపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు, టీం ఫర్ గుడ్ గవర్నన్స్ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.







## యూనిఫామ్‌లో డ్యాన్స్ లొద్దు

**హైదరాబాద్, మహా :** పోలీస్ యూనిఫామ్ ధరించి ప్రైవేటు కార్యక్రమాల్లో డ్యాన్సులు చేయడం, సోషల్ మీడియాలో రీల్స్ చేయడంపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరికలు జారీ చేశారు. యూనిఫామ్‌లో ఉన్నప్పుడు నిబంధనలను ఉల్లంఘించి అనధికార కార్యక్రమాల్లో పాల్గొంటే కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇటీవల, కొంతమంది పోలీసు సిబ్బంది వివాహాలు, ఇతర ప్రైవేట్ కార్యక్రమాల్లో యూనిఫాం ధరించి డ్యాన్సులు చేస్తున్న వీడియోలను రూపొందిస్తున్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఇటువంటి వీడియోలు కొన్ని సందర్భాల్లో వైరల్‌గా మారాయి. ఈ ధోరణి, పోలీసు విభాగంలో ఉండాల్సిన క్రమశిక్షణ, యూనిఫామ్‌కు ఇవ్వాల్సిన గౌరవంపై చర్చకు దారితీస్తుందని డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. పోలీసు యూనిఫాం అనేది కేవలం దుస్తులు మాత్రమే కాదని, అది అధికారం, బాధ్యత, క్రమశిక్షణలకు ప్రతీక అని డీజీపీ పేర్కొన్నారు. ధరించినప్పుడు సిబ్బంది వృత్తిపరమైన హుందాతనాన్ని పాటించాలని డీజీపీ సూచించారు. యూనిఫామ్ గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధి నిర్వహణలోనే కాకుండా యూనిఫామ్ ధరించిన సందర్భాల్లోనూ పోలీసు శాఖ ప్రతిష్ఠను కాపాడాలని, ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. అధికారిక సాంస్కృతిక కార్యక్రమాలు, వేడుకలకు ఈ ఆదేశాలు వర్తిస్తాయా అనే అంశంపై మాత్రం స్పష్టత లేదు.

# స్నేహిత బిల్డర్ల అరాచకం...!



**స్పెషల్ టాస్క్ ఫోర్స్ హైదరాబాద్, మహా**: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గండిపేట మండలం బండ్లగూడ జాగీర్ పీరం చెరువు బఫర్ జోన్ దురాక్రమణకు గురైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువులు, నాలాలు, కుంటలను కాపాడాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా జలవనరులు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఆక్రమణలను అడ్డుకుని కేసులు నమోదు చేసిన అధికారులు.. అదే స్థలంలో నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలపై ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సర్వే నంబర్ 24/ఏ/2లో స్నేహిత బిల్డర్స్‌కు సంబంధించిన భూమి చెరువు బఫర్ జోన్ పరిధిలో ఉందని, పక్కనే ప్రవహించే నాలా సైతం ఆక్రమణకు గురైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాడు మట్టి పోసి భూమిని చదును చేస్తుండగా అడ్డుకుని కేసులు నమోదు చేసిన అధికారులు.. నేడు అదే ప్రాంతంలో నిర్మాణ అనుమతులు ఎలా జారీ చేశారన్నది అంతు చిక్కని ప్రశ్నగా మారింది. చెరువు, నాలా భూముల పరిరక్షణలో సంబంధిత శాఖల బాధ్యత ఏమైందని స్థానికులు నిలదీస్తున్నారు.

**గతంలోనే అడ్డుకున్న రెవెన్యూ అధికారులు..!**

హెచ్ఎండీఏ చెరువుల వివరాలు, ఇరిగేషన్ శాఖ రికార్డుల ప్రకారం పీరం చెరువు ఐడీ నంబర్ 2933గా ఉన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ చెరువు విస్తీర్ణం 30.801 ఎకరాలు కాగా, ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్)ను 1848.458 మీటర్లుగా నిర్ధారించి, 24 మీటర్ల మేర బఫర్ జోన్ హద్దులు ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సర్వే నంబర్ 24/ఏ/2లోని సుమారు 1,430 గజాల భూమి పూర్తిగా బఫర్ జోన్ పరిధిలోకి వస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో ఇదే స్థలంలో ట్రాక్టర్లతో మట్టి పోసి భూమిని నింపుతుండగా అప్పటి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరసింహగౌడ్ అడ్డుకుని, ఆక్రమణదారులపై కేసులు నమోదు చేసినట్లు స్థానికులు వెల్లడిస్తున్నారు. మరి అప్పట్లో ఆక్రమణగా భావించి అడ్డుకున్న భూమిలో ప్రస్తుతం నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతులు ఎలా వచ్చాయి? అప్పటి కేసులపై తదుపరి చర్యలు ఏమయ్యాయి? అనే ప్రశ్నలు ఇప్పుడు ఉత్పన్నమవుతున్నాయి.

**ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే అక్రమాలు...!**

బఫర్ జోన్ పరిధిలో భూమిని చదును చేయడంతో పాటు, ఎలాంటి అనుమతులు లేకుండా రెండు బోర్లు వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖలో ప్రస్తుతం పనిచేస్తున్న ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ శాఖ నుంచి ఎన్‌వోసీ పొందినట్లు చూపించి, అప్పటి బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి నిర్మాణ అనుమతులు పొందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారీగా ముడుపులు ముట్టడటంతోనే, నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు జారీ చేసి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందుతున్నప్పటికీ, సంబంధిత అధికారులు కనీసం నోటీసులు కూడా జారీ చేయకుండా కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. అక్రమాలపై తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనం వహించడం వెనుక కారణాలేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. బఫర్ జోన్ పరిధిలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన వారితో పాటు బాధ్యులైన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**హైడ్రా బాస్ స్పందించాలి..!**

చెరువులు, నాలాలు, ప్రభుత్వ జలవనరుల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్న హైడ్రా అధికారులు పీరం చెరువు వ్యవహారంపై తక్షణమే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దులను సంబంధిత శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో సర్వే చేయించాలని కోరుతున్నారు. సర్వే నంబర్ 24/ఏ/2లోని భూమి వాస్తవంగా బఫర్ జోన్ పరిధిలో ఉందా? ఇరిగేషన్ ఎన్‌వోసీ, నిర్మాణ అనుమతులు నిబంధనలకు అనుగుణంగా జారీ అయ్యాయా? గతంలో నమోదైన కేసులపై ఏం చర్యలు తీసుకున్నారు? అనే అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆక్రమణలు, నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణైతే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుని, చెరువు భూములను పరిరక్షించాలని, హైడ్రా కమిషనర్ స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

### కాళీమందిరం సాక్షిగా చెరువు భూమికి ముప్పు..!

బండ్లగూడ సర్కిల్ పరిధిలోని పీరం చెరువు, కాళీమందిర్ (ఆరె మైసమ్మ) సమీపంలో ఉన్న భూములు ఆక్రమణకు గురవుతున్నాయనే ఆరోపణలు స్థానికుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధులను కాపాడాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు. చెరువు భూములు, పక్కనే ఉన్న నాలా ఆక్రమణకు గురైతే వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడటమే కాకుండా, భవిష్యత్తులో వరద ముప్పు పెరిగే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనే ఫిర్యాదులు చేసినా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణల నేపథ్యంలో, ఈ వ్యవహారంపై ఉన్నతస్థాయి విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### మహాలో వెలువడిన కథనాలు










# కరువుపై సర్కారు కదం

**( మొదటి పేజీ తరువాయి )**

(స్పెషల్ ఆఫీసర్లు) నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన జిల్లాల్లో వర్షపాతం, జలాశయాల్లో నీటి మట్టాలు, భూగర్భ జలాలు, తాగునీటి లభ్యత, వ్యవసాయ, ఉద్యాన పంటల స్థితిగతులు, విద్యుత్ సరఫరా తదితర అంశాలను పర్యవేక్షించనున్నారు. పరిస్థితులను ఎదుర్కొనేందుకు వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ఉండేలా వీరు చర్యలు తీసుకుంటారు. ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన జిల్లాల్లో పర్యటించి, ఉమ్మడి జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో నిర్వహించే సమీక్షా సమావేశాల్లో సహకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, గతంలోనే రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాలకు ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించింది. ఆ ఉత్తర్వుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఎ. శ్రీదేవసేనను నియమించగా, తాజాగా ఆ ఆదేశాలను పాక్షికంగా సవరిస్తూ డా. టి.కె. శ్రీదేవికి ఈ బాధ్యతలు అప్పగించి.. మరోసారి పూర్తి లిస్ట్ విడుదల చేసింది. ప్రత్యేక అధికారులు ఉమ్మడి జిల్లాలో అవగాహన సదస్సులు సైతం నిర్వహించనున్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల రాష్ట్ర స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితులను చక్కదిద్దేందుకు చర్యలు తీసుకుంటారు. అలాగే ఎల్‌నినో పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్ మరింత పెంచింది. సీఎం రేవంత్ రెడ్డి ఎప్పటికప్పుడు వివరాలు తీసుకుంటున్నట్లు అధికారుల సమాచారం. ఉమ్మడి జిల్లాల వారీగా నియమితులైన ప్రత్యేక అధికారులు

**హైదరాబాద్: జయేశ్ రంజన్**
**రంగారెడ్డి: వికాస్ రాజ్**
**కరీంనగర్: బెన్హర్ మహేష్ దత్ ఎక్కా**
**మెదక్: ఎ.వాణి ప్రసాద్**
**నిజామాబాద్: డాక్టర్ యోగితా రాణా**
**నల్గొండ: హరిచందన దాసరి**
**ఆదిలాబాద్: కె.ఇలంబరితి**
**వరంగల్: టి.కె. శ్రీదేవి**
**మహబూబ్‌నగర్: వి.పి. గౌతమ్**
**ఖమ్మం: అనుదీప్ దురిశెట్టి**

# హైదరాబాద్‌లో హ్యుందాయ్ కార్ల తయారీ ప్లాంట్



**హైదరాబాద్, మహా :** తెలంగాణను కార్ల తయారీకి అనువైన ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో హ్యుందాయ్ కార్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ఆ సంస్థ యాజమాన్యాన్ని కోరారు. రాష్ట్రంలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. జహీరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న హ్యుందాయ్ గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేంద్రానికి సంబంధించిన పెండింగ్ అనుమతులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం బోధి పెవిలియన్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యాన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, జహీరాబాద్‌లో ప్రతిపాదిత ప్రాజెక్టు పురోగతిపై చర్చించారు.

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మ్యానుఫాక్చరింగ్ జోన్ లో రూ.8,528 కోట్ల పెట్టుబడితో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ఇంటిగ్రేటెడ్ గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. 678 ఎకరాల్లో విడతలవారీగా అభివృద్ధి చేయనున్న ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 4,276 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ప్రాజెక్టు పురోగతిని హ్యుందాయ్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. రాబోయే కొద్ది నెలల్లోనే ఆర్ అండ్ డీ కేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పనులు వేగంగా ముందుకు సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన సీఎం అవసరమైన అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హ్యుందాయ్ సంస్థకు హైదరాబాద్‌తో రెండు దశాబ్దాల అనుబంధం ఉంది. హైటెక్ సిటీలోని కేంద్రం అధునాతన వాహన ఇంజినీరింగ్‌కు మద్దతునిస్తూ కీలక ఆర్‌అండ్‌డీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ సామర్థ్యాలను మరింత విస్తరించేలా జహీరాబాద్‌లో గ్లోబల్ ఆర్‌అండ్‌డీ, మెగా టెస్టింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రం ద్వారా వాహనాల రూపకల్పన, పరీక్షలు, పనితీరు, ధ్రువీకరణ, నాణ్యతా ప్రమాణాల పరిశీలనతోపాటు ఇంజినీరింగ్ ప్రక్రియలను మరింత మెరుగుపరిచేందుకు అవకాశం కలగనుంది. హ్యుందాయ్ అధునాతన సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది. దేశంలో తెలంగాణ భౌగోళికంగా మధ్యలో ఉందని, హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కలిగిన నగరమని ముఖ్యమంత్రి తెలిపారు. దేశంలోని ఆరు ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలతో పోలిస్తే హైదరాబాద్ సురక్షితమైన, జీవించడానికి అనుకూలమైన కాస్మోపాలిటన్ నగరంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. కార్ల తయారీ పరిశ్రమకు అవసరమైన రవాణా, మౌలిక సదుపాయాలు తెలంగాణలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. రహదారులు, రైలు మార్గాలు, విమానాశ్రయాలతోపాటు భవిష్యత్తులో ఓడరేవులకు హైస్పీడ్ కనెక్టివిటీ కల్పించే ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక మొబిలిటీ క్లస్టర్ల అభివృద్ధితో వాహన తయారీ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని చెప్పారు. పెరిఅర్బన్ రీజియన్ వంటి ప్రణాళికల ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, తయారీ రంగంలో పెట్టుబడులకు తెలంగాణ అనువైన వేదికగా నిలుస్తుందని సీఎం వివరించారు. తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో 2024 ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం హ్యుందాయ్ ప్రతినిధులతో చర్చలు జరిపింది. అనంతరం 2025 జూన్‌లో హ్యుందాయ్ ఆర్‌అండ్‌డీ కేంద్రం ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. ప్రపంచ స్థాయి సౌకర్యాలతో భారీ శాటిలైట్ నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సీఎం హ్యుందాయ్ ప్రతినిధి బృందానికి వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను తెలియజేస్తూ, రాబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరుకావాలని సంస్థ యాజమాన్యాన్ని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను అంతర్జాతీయ సాంకేతిక, అధునాతన ఇంజినీరింగ్ కేంద్రంగా మరింత బలోపేతం చేయాలన్న హ్యుందాయ్ లక్ష్యం తెలంగాణ రైజింగ్-2047 విజన్‌కు అనుగుణంగా ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యాన్ చో తెలిపారు. తెలంగాణ అభివృద్ధి ప్రస్థానంలో తమ సంస్థ భాగస్వామిగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్‌ఆఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎల్లంపేటలో అక్రమార్కుల అరాచకం..!

**మహా, మేడ్చల్–మల్కాజిగిరి :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని గట్సార్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్స్‌కు చెందిన అరుణ గోదాం (కోల్డ్ స్టోరేజ్) వ్యవహారం మరోసారి వివాదాస్పదంగా మారింది. సర్వే నంబర్లు 70, 71లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న గోదాంను కూల్చివేయాలని రాష్ట్ర ఉపలోకాయుక్త న్యాయస్థానం ఆదేశించినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ఆ ఉత్తర్వులు అమలుకు నోచుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాన్ని తొలగించాల్సిన అధికారులు సీజ్ చర్యలకే పరిమితమయ్యారని, సీజ్ చేసిన కొద్ది రోజులకే గోదాం తిరిగి తెరుచుకుని కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని టీం ఫర్ గుడ్ గవర్నెన్స్ సొసైటీ పేర్కొంది. ఈ వ్యవహారంపై మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ (సీడీఎంఏ)కు సంస్థ ప్రతినిధులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో అధికారుల తీరుపై చర్చ మొదలైంది.

**లోకాయుక్త ఆదేశాలు బేఖాతరు..!**

ఎల్లంపేటలోని సర్వే నంబర్లు 70, 71లో అరుణ గోదాం యాజమాన్యం అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతోందంటూ స్థానికులు గతంలోనే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 2025 నవంబర్ 26న మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, 2026 జనవరి 12న జిల్లా కలెక్టర్ ప్రజావాణిలోనూ ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ టీం ఫర్ గుడ్ గవర్నెన్స్ సొసైటీ రాష్ట్ర ఉపలోకాయుక్త న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. దీనిపై దాఖలైన కంప్లైంట్ నంబర్ 152/2026/బి2ను విచారించిన న్యాయస్థానం 2026 ఏప్రిల్ 23న అక్రమ నిర్మాణాన్ని నిలిపివేసి, తొలగించాలని ఆదేశించినట్లు ఫిర్యాదుదారులు వెల్లడించారు. అయినప్పటికీ ఉత్తర్వుల అమలులో జాప్యం ఎందుకనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**కూల్చివేయాలన్న ఉత్తర్వులు.. సీజ్‌తోనే సరి..**

ఉపలోకాయుక్త ఉత్తర్వుల ప్రతులను 2026 మే 30న మున్సిపల్ కమిషనర్‌కు, జూన్ 1న జిల్లా కలెక్టర్ ప్రజావాణిలో అందజేసినట్లు ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. అయితే, అక్రమ నిర్మాణాన్ని తొలగించాల్సి ఉండగా, ఎల్లంపేట మున్సిపల్ అధికారులు ఆగస్టు 4న ఆర్‌వోసీ నంబర్ జి1/141/2026 ద్వారా గోదాంను సీజ్ చేసినట్లు నివేదించారని తెలిపారు. అనంతరం ఆగస్టు 5న సీజ్ చేసినట్లు గతంలో పేర్కొన్నప్పటికీ, సీజ్ చేసిన కొద్ది రోజులకే గోదాం తిరిగి తెరుచుకుని కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీజ్ చేసిన ప్రాంగణాన్ని పర్యవేక్షించాల్సిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. లోకాయుక్త ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాన్ని తొలగించకుండా, సీజ్ చర్యతోనే వ్యవహారాన్ని ముగించారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**మున్సిపల్ ఆదాయానికి గండి**

సంబంధిత అనుమతులు, భవన వినియోగ నిబంధనలు, పన్నులు, ఇతర రుసుముల చెల్లింపులపై సమగ్ర విచారణ జరపాలని టీం ఫర్ గుడ్ గవర్నెన్స్ కోరుతోంది. మున్సిపాలిటీకి రావాల్సిన లక్షలాది రూపాయల ఆదాయానికి గండి పడుతోందని, నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ అక్రమార్కుల చేతిలో కీలుబొమ్మగా మారారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సంస్థ తన ఫిర్యాదులో ఆరోపిస్తున్నారు.

**అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరపాలి..!**

లోకాయుక్త ఉత్తర్వులు అమలుకాకపోవడం, సీజ్ చేసిన గోదాం తిరిగి తెరుచుకోవడం వెనుక కారణాలపై ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. సీజ్ చేసిన తర్వాత గోదాంలో కార్యకలాపాలు తిరిగి ప్రారంభమయ్యాయా? ప్రారంభమైతే ఎవరి అనుమతితో కొనసాగుతున్నాయి? వాటిని అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్, మున్సిపల్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదు? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు. అధికారుల సహకారం ఉందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్న నేపథ్యంలో, వాటి నిజానిజాలను ఆధారాలతో పరిశీలించి బాధ్యత వహించాల్సిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**సీడీఎంఏ స్పందించాలి..**
**క్రిమినల్ కేసులు నమోదు చేయాలి**

గట్సార్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్స్ (అరుణ గోదాం) వ్యవహారంపై సీడీఎంఏ తక్షణమే స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించాలని టీం ఫర్ గుడ్ గవర్నెన్స్ సొసైటీ కోరుతోంది. రాష్ట్ర ఉపలోకాయుక్త న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేసి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణంపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది. సీజ్ చేసిన ప్రాంగణాన్ని అనుమతి లేకుండా తెరిచి కార్యకలాపాలు కొనసాగించినట్లు నిర్ధారణ అయితే, బాధ్యులపై వర్తించే చట్టాల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరుతోంది. కేవలం నోటీసులు, సీజ్ చర్యలతో సరిపెట్టకుండా, అక్రమ నిర్మాణాన్ని తొలగించే దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లోకాయుక్త ఉత్తర్వులను అమలు చేస్తారా? లేక ఈ వ్యవహారం ఫిర్యాదులకే పరిమితమవుతుందా? అన్నది తేలాల్సి ఉంది.


OFFICE OF THE YELLAMPET MUNICIPALITY
MEDCHAL-MALKAJIGIRI DISTRICT- TELANGANA

Lr.Roc.No. G1/141/2026. Dated:04.08.2026.

INTIMATION LETTER

Sub: Yellampet Municipality - Yellampet Municipality - Town planning wing - Action taken report on Aruna Godown / Ghatsar Infra structure in Yellampet Municipality Intimation Reg

Ref: 1. Your Application Date: 25.09.2025 & 26.11.2025.
2. Hon'ble Upa-Lokayukta of Telangana Complaint No 152/2026/B2, Dated 23.04.2026.
3. Your Application Date: 30.05.2026.

In Compliance of the orders of the Hon'ble Lokayukta on dated 23.04.2026 vide in its order no 152/2026/B2 Ghatsar Infra Structure /Aruna Godown has constructed un-authorized, so that this office seized the construction as per due course as per Telangana Municipal Act-2019.

Commissioner
Yellampet Municipality

To,
Sri Thalari Chandar S/o T.Narasihma
Yellampet Village,
Yellampet Municipality.

అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేయాలంటూ లోకాయుక్త జారీ చేసిన ఆర్డర్


Date:12/10/2026

To
The commissioner & Director of Municipal, Administration (CDMA) office Telangana

TAPPAL 12 OCT 2026

(PTO)

'టీమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సొసైటీ' తరపున సి డిఎమ్ ఏ కి చేరిన ఫిర్యాదు







## ఇది ప్రభుత్వాన్ని మార్చే కుట్ర : బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్

### విదేశీ శక్తులతో దేశాన్ని అస్థిరపరిచే ప్రయత్నం చేస్తున్నారని ఫైర్

**ఢిల్లీ, మహా** : ప్రతిపక్షాలు విదేశీ శక్తులతో కలిసి 'ప్రభుత్వాన్ని మార్చే కుట్ర' పన్నుతున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్ర ఆరోపణలు చేశారు. 'రెజీమ్ ఛేంజ్' వంటి పదాల వాడకంతో ప్రతిపక్షాల అసలు ఎజెండా దేశం ముందు బయటపడిందని.. విదేశీ శక్తులతో కలిసి దేశాన్ని అస్థిరపరిచేందుకు అర్బన్ నక్సల్స్ పన్నిన పన్నాగం ఇది అని ఆయన మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజల తీర్పుతో వస్తుంది కానీ, అరాచకంతో కాదు అని ఆయన హితవు పలికారు. నేతల అరెస్టులు జరిగినప్పటికీ, సుమారు 200 నుంచి 300 మంది నిరసనకారులు కన్నాట్ ప్లేస్‌కు చేరుకుని తమ నిరసనను కొనసాగించారు.

## ఖైరతాబాద్ ఉపఎన్నికలో బలమైన అభ్యర్థిని నిలబెడతాం

**తెలంగాణ రక్షణసమితి అధినేత కవిత**



**హైదరాబాద్, మహా :** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికపై స్పందించారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందని, బలమైన అభ్యర్థిని నిలబెడతామని ఆమె ప్రకటించారు. దసరా రోజున ఒక ఎమ్మెల్సీ అభ్యర్థిని కూడా ప్రకటిస్తామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనను పక్కనపెట్టి రాజకీయాలపైనే దృష్టి సారిస్తున్నారని కవిత ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు కరవుతో అల్లాడుతుంటే, ముఖ్యమంత్రి మాత్రం గోవా, ఢిల్లీ పర్యటనల్లో బిజీగా ఉన్నారని విమర్శించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు రాబోయే ఏడెనిమిది నెలల పాటు ప్రజల్లోనే ఉండి క్షేత్రస్థాయిలో పోరాడతామని కవిత స్పష్టం చేశారు. నవంబర్ చివరి వరకు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పనులను వెంటనే పునరుద్ధరించి పూర్తి చేయాలని కోరారు. పారదర్శకత కోసం ఇకపై అన్ని ఎన్నికలను ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. గ్లోబల్ సమ్మిట్‌పై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయకపోతే అడ్డుకుంటామని హెచ్చరించారు.



## ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

**చిక్కడపల్లి, మహా :** కళా నిలయం సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం త్యాగరాయ గాన సభలో నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. శ్రీమతి ఫణి దుర్గ శిష్యురాళ్లు,చిన్నారి ఎం. సహస్ర, ధన్వికధ తమ నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు ప్రదర్శనల తో ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు.

# ఏపీలో మొదలైన ఎన్నికల హింస

( మొదటి పేజీ తరువాయి )

ధ్వంసమవ్వగా, ఇరువర్గాలకు చెందిన పలువురు కార్యకర్తలకు గాయాలయ్యాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు గాల్లోకి గాల్పులు జరపాల్సి వచ్చింది.

**వైసీపీ దాడుల్లో వాహనాలు ధ్వసం..**

టీడీపీ నేత మధురాయల్ (మధు రెడ్డెప్ప రాయల్) పై వైఎస్సార్ సీపీ ఎంపీ మిథున్ రెడ్డి అనుచరులు దాడికి పాల్పడినట్లు పార్టీ శ్రేణులు ఆరోపించాయి. పోలీసులతో పాటు టీడీపీ అభ్యర్థులపై వైసీపీ వర్గీయులు దాడికి తెగబడ్డాయని, వారి దాడిలోనే వాహనాలు ధ్వంసమయ్యాయని వారు పేర్కొన్నారు. ఇరువర్గాల పోటాపోటీ ఆరోపణలు, రాళ్లదాడి ఘటనలతో పుంగనూరు పరిసర ప్రాంతాల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతుండగా, పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

**గేట్లు ఢీకొడుతూ మిథున్ రెడ్డి వర్గీయులు హల్ చల్**

వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి తన అనుచరులతో కలిసి నామినేషన్ కేంద్రానికి వెళ్తున్న సమయంలో వాహనాలపై టీడీపీ కార్యకర్తలు రాళ్లు రువ్వారని ఆరోపించారు. తీవ్ర ఉద్రిక్తతల నడుమ ఎంపీ మిథున్ రెడ్డి, ఇతర వైసీపీ నేతలు నామినేషన్ కార్యాలయంలోకి వెళ్లారు. గేట్లను వాహనంతో ఢీకొడుతూ దూసుకెళ్లారని టీడీపీ నాయకులు తెలిపారు. వారిని అడ్డుకునేందుకు టీడీపీ కార్యకర్తలు యత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. దాంతో పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు.

**రాయచోటిలోనూ రణరంగం..**

అన్నమయ్య జిల్లా రాయచోటిలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తీవ్ర హింసాత్మకంగా మారింది. రాయచోటిలోని ఎస్ఎన్ కాలనీలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఒక్కసారిగా ఘర్షణ తలెత్తింది. ఇరువర్గాల నాయకులు, కార్యకర్తలు రాళ్లు, కర్రలతో పరస్పరం దాడులు చేసుకోవడంతో ఆ ప్రాంతమంతా రణరంగంగా మారింది. ఈ ఘర్షణల్లో సుమారు 15 కార్లు తీవ్రంగా ధ్వంసమవ్వగా, 4 కార్లకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అవి పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇదే సమయంలో రాయచోటిలోని వైసీపీ కార్యాలయం వద్ద నిలిపి ఉంచిన వాహనాలకు కూడా నిప్పు పెట్టడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నామినేషన్ల వేళ ఒకేసారి భారీగా తరలిరావడం, పరస్పర దాడులకు పాల్పడటంతో అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. పరిస్థితులను అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు రంగంలోకి దిగి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## అనిరుధ్‌కావ్య మారన్ వివాహం

**మహా :** అనిరుధ్, కావ్య మారన్‌ల వివాహం నవంబర్ 11న గ్రీస్‌లో జరుగుతుందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. తాజాగా, సన్ గ్రూప్ ఛైర్మన్ కళానిధి మారన్, ఆయన భార్య కావేరి మారన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న సీఎం నివాసంలో ఈ భేటీ జరిగింది. నవంబర్ 21వ తేదీన చెన్నైలో జరగనున్న తమ కుమార్తె కావ్య మారన్‌అనిరుధ్ రవిచందర్‌ల వివాహ రిసెప్షన్‌కు హాజరు కావాల్సిందిగా వారు సీఎం రేవంత్ రెడ్డి దంపతులను ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ ఆహ్వానంతో రిసెప్షన్ తేదీపై స్పష్టత వచ్చింది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, డీఎంకే అధినేత స్టాలిన్ వంటి ప్రముఖులకు కూడా కళానిధి మారన్ స్వయంగా ఆహ్వాన పత్రికలు అందించనున్నారని సమాచారం. ఈ పరిణామంతో, త్వరలోనే మారన్ కుటుంబం నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని భావిస్తున్నారు



## దమ్మపేట కే వన్నెతెచ్చిన "దారా" వాసవీక్లబ్స్ గవర్నర్ గా ఏకగ్రీవం.

**పలు సంఘాల అభినందనలు**

**దమ్మపేట, మహా :** సేవారంగంలో తనకు తానే సాటి అనే పదానికి నిలువెత్తు నిదర్శనం గా నిలిచిన దమ్మపేట పట్టణ కేంద్రానికి చెందిన మాజీ వైస్ ఎంపిపి దారా మల్లిఖార్జునరావు మరొక్కసారి నిరూపించుకోగలిగారు. ఇటీవల జరిగిన వాసవీక్లబ్స్ జిల్లా స్థాయి గవర్నర్ ఎంపికల్లో ఏకగ్రీవంగా జిల్లా గవర్నర్ గా నియమితులైన దారా కు పలు సంఘాల అభిమానులు శుక్రవారం అభినందనలతో ముంచెత్తారు. దీంతో దమ్మపేట కే వన్నెతెచ్చిన సోషల్ వర్కర్ గా మల్లిఖార్జునుడు కీర్తిని ఆపాదించుకోగలిగారు. ఇప్పటికే పలు సేవాకార్యక్రమాలు , వాసవి క్లబ్ ,లయన్స్ క్లబ్ , ఆర్య వైశ్య సంఘం , ఆధ్యాత్మిక దేవాలయాల ట్రస్టీలుగా ,రాజకీయంగా ,సేవా పరంగా ఎందరో మన్ననలు పొందిన దారా కు వాసవిక్లబ్ డిస్టిక్ గవర్నర్ పదవి వరించడం ఎంతో శుభ ప్రదమని పలువురు ప్రశంసించారు. దీంతో భాద్యతలు మరింతగా పెరిగినట్లు గుర్తుచేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా దమ్మపేట మండలానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు ఎంపికయ్యారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన డిస్ట్రిక్ట్ గవర్నర్ నామినేషన్ల ప్రక్రియలో ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో, ఇతరుల నుంచి నామినేషన్లు రాకపోవడంతో ఆయన ఎంపికకు మార్గం సుగమమైంది. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బాధ్యతలు ఆయనకు దక్కాయి.

**సేవా రంగంలో మరింత బాధ్యతలు:**

గతంలో దమ్మపేట మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా (వైస్ ఎంపీపీ) పనిచేసిన దారా మల్లికార్జునరావుకు ఈ బాధ్యతలు దక్కడం పట్ల స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది. ప్రజాప్రతినిధిగా పనిచేసిన అనుభవంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో మరింత చురుగ్గా వ్యవహరించేందుకు ఈ పదవి అవకాశం కల్పిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో విద్య, వైద్యం, ఆరోగ్య అవగాహన, రక్తదాన శిబిరాలు, పేద విద్యార్థులకు సహాయం, నిరుపేద కుటుంబాలకు చేయూత వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రాధాన్యం ఇవ్వవచ్చు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని క్లబ్ సభ్యులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను విస్తరించాలన్న బాధ్యత డిస్ట్రిక్ట్ గవర్నర్‌పై ఉంటుంది.దమ్మపేటకు గుర్తింపు: ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా దారా మల్లికార్జునరావు ఎంపిక కావడం దమ్మపేట ప్రాంతానికి గుర్తింపు తీసుకువచ్చే పరిణామంగా స్థానికులు భావిస్తున్నారు. ఆయన నాయకత్వంలో వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి, సమాజంలోని పేదలు, విద్యార్థులు, అవసరంలో ఉన్న కుటుంబాలకు ప్రయోజనం చేకూరాలని ఆకాంక్షిస్తున్నారు. డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ఎంపికైన దారా మల్లికార్జునరావుకు పలువురు అభినందనలు తెలుపుతూ, ఆయన తన బాధ్యతలను సమర్థంగా నిర్వహించి మరిన్ని సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని ఆకాంక్షిస్తున్నారు. అభినందనలు తెలిపిన వారిలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు పసుమర్తి రామభద్రరావు ,పట్టణ కమిటీ , వాసవీ క్లబ్ సభ్యులు , రిటైర్డ్ ఉద్యోగుల సంఘం , మీడియా క్లబ్ లు , వివిధ రాజకీయ పార్టీల నాయకులు , వివిద కుల సంఘాలు , మహిళా సంఘాలు , దేవాలయ కమిటీ చైర్మన్ లు ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.

# తెలంగాణలో వారం పాటు వర్షాలు

**తెలంగాణకు ఐఎండీ రెయిన్ అలర్ట్**

**కొన్ని జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ**



**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో రాగల ఏడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. ఈ మేరకు కొన్ని జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. అక్టోబర్ 16 నుంచి అక్టోబర్ 21 వరకు పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే సూచనలున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం ఉదయం 08:30 వరకు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు మరియు గంటకు 3040 కి.మీ వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడొచ్చు. 17, 18 తేదీలలో అక్కడక్కడ వర్షాలతో పాటు ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు (3040 కి.మీ/గంట) వీచే అవకాశం ఉంది. 18, 19 తేదీలలో : రాష్ట్రంలో కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయి. ములుగు, భద్రాద్రి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఈదురుగాలుల హెచ్చరికలు జారీ అయ్యాయి. 19, 20 తేదీలలో పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఈదురుగాలులతో వర్షాలు పడవచ్చు. 20, 21 తేదీలలో కొన్ని చోట్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ములుగు, భద్రాద్రి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు వాతావరణ హెచ్చరికలు ఉన్నాయి. 21, 23 తేదీలలో రాష్ట్రంలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉన్నప్పటికీ ఈ రెండు రోజులకు ఎలాంటి ప్రత్యేక హెచ్చరికలు లేవు.



## అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌తో నగరాభివృద్ధికి చర్యలు

- **ప్రతిపాదనలు, డీపీఆర్‌లను వివరించిన జిల్లా కలెక్టర్**

**హనుమకొండ, మహా;** రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి, సీడీఎంఏ డాక్టర్ టి.కె. శ్రీదేవి శుక్రవారం హైద్రాబాద్ నుండి రాష్ట్రంలోని మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద చేపట్టనున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా హన్మకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రేటర్ వరంగల్ నగరంలో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద ప్రతిపాదించిన అభివృద్ధి పనులు, వాటికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికల వివరాలను వెల్లడించారు. నగరంలో ఆర్థిక కార్యకలాపాల అభివృద్ధి, రవాణా ఆధారిత పట్టణాభివృద్ధి, ప్రాంతీయ ప్రణాళిక, పట్టణ పునరుద్ధరణ, తాగునీరు, పారిశుద్ధ్యం, నగర ప్రాంతాల పునరాభివృద్ధి వంటి కీలక అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలను వివరించారు. నగర భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సిపిఓ అజిత్ రెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మహేందర్, రవికుమార్, సంజయ్ కుమార్, భీమ్‌రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## విద్యార్థినులతో కలిసి బతుకమ్మ కోలాటం

**సత్తుపల్లి నర్సింగ్ కళాశాలలో ఎమ్మెల్యే రాగమయి పండుగ సందడి**

సత్తుపల్లి, అక్టోబరు 16:మహా: బతుకమ్మ సంబరాలు సత్తుపల్లి ప్రభుత్వ నర్సింగ్ జూనియర్ మహిళా కళాశాలలో ఉత్సాహంగా సాగాయి. కృషి బైపాస్ రోడ్డులోని కళాశాలలో శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు. విద్యార్థినులతో కలిసి ఎమ్మెల్యే బతుకమ్మ కోలాటం ఆడుతూ సందడి చేశారు. దీంతో కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.

**సంప్రదాయాలకు ప్రాధాన్యం**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని విద్యార్థినులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. మహిళా ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విద్యార్థినులతో కలిసి సంబరాల్లో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రిహానా బేగం, కమల్ పాషా, మహిళా కౌన్సిలర్లు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థినులు, సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## యూనిక్ కంపెనీ పేరుతో భారీ పెట్టుబడుల మోసం

- **ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ రాయ్ అరెస్ట్**
- **కరీంనగర్ బాధితులు వెంటనే ఫిర్యాదు చేయాలి: సీపీ గౌష్ ఆలం**

**కరీంనగర్ మహా :** అధిక లాభాలు, మెచ్యూరిటీ ప్రయోజనాలు, ప్లాట్ల కేటాయింపు ఆశ చూపి ప్రజల నుంచి భారీగా పెట్టుబడులు సేకరించి తిరిగి చెల్లించకుండా మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న యూనిక్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రాజ్‌కుమార్ రాయ్ అలియాస్ రాజ్‌కుమార్ కైలాష్ రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన నిందితుడిని ఆదిలాబాద్ జిల్లా తలమడుగు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు సమాచారం.

**ఆకర్షణీయమైన హామీలతో పెట్టుబడుల సేకరణ**

యూనిక్ కంపెనీ పేరుతో వార్షిక చెల్లింపులు, నెలవారీ వాయిదాలు, స్థిర డిపాజిట్ల రూపంలో ప్రజల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు సేకరించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అధిక లాభాలతోపాటు మెచ్యూరిటీ ప్రయోజనాలు కల్పిస్తామని, అవసరమైతే ప్లాట్లు కేటాయిస్తామని నమ్మించినట్లు తెలిసింది. గడువు ముగిసినా పెట్టుబడి మొత్తాలు, మెచ్యూరిటీ ప్రయోజనాలు తిరిగి చెల్లించకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

**తెలంగాణలో 14 కేసులు.. దేశవ్యాప్తంగా 10 వేల మంది బాధితులు**

ఈ వ్యవహారానికి సంబంధించి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 14 కేసులు నమోదైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. దేశవ్యాప్తంగా సుమారు 10 వేల మంది బాధితులు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. పెట్టుబడుల రూపంలో సేకరించిన డబ్బుతో నిందితుడు పలు రాష్ట్రాల్లో హోటళ్లు, భూములు, ప్లాట్లు కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం.

**బాధితులు వెంటనే ఫిర్యాదు చేయాలి**

కరీంనగర్ జిల్లాలో యూనిక్ కంపెనీ పేరుతో పెట్టుబడులు పెట్టి మోసపోయిన బాధితులు ఆలస్యం చేయకుండా కరీంనగర్ సీసీఎస్ పోలీస్ స్టేషన్‌ను లేదా అడిషనల్ డీసీపీ (అడ్మిన్)ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ సూచించారు. బాధితులు తమ వద్ద ఉన్న పెట్టుబడి రశీదులు, బ్యాంకు లావాదేవీల వివరాలు, కంపెనీకి సంబంధించిన పత్రాలు, ఇతర ఆధారాలను ఫిర్యాదుతో పాటు సమర్పించాలని కోరారు. బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే సంబంధిత వివరాల పరిశీలనకు వీలవుతుందని తెలిపారు.



## శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న కుడా చైర్ పర్సన్

**వరంగల్, మహా :** వరంగల్ దేశాయిపేట రోడ్డు టీచర్స్ కాలనీ, గణేష్ నగర్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన చండీ హోమంలో కాకతీయ పట్టనాభివృద్ధి సంస్థ చైర్ పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, జి.డబ్ల్యూ.ఎం.సి. మాజీ మేయర్ గుండు సుధారాణి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి ని ఆలయ కమిటీ వారు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బిల్లా కవిత శ్రీకాంత్, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అధ్యక్షులు పెండెం వరప్రసాద్, గౌరవ అధ్యక్షులు విజయ భాస్కర్ రావు, సలహాదారులు కైలాసం, ప్రధాన కార్యదర్శి కే యాదగిరి, కోశాధికారి శ్రీరాములు, మహిళా కమిటీ సభ్యులు సావిత్రి, వాణి, కవిత, శ్రీదేవి, మమత, స్వాతి, విజయ, సౌమ్య లతోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి

**ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు**

**పెద్దపల్లి మహా :** ఓదెల మండలంలోని రూపునారాయణపేట గ్రామంలోని తన నివాసంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయ రమణారావు ఓదెల మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై సమీక్షించి, అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకం ఫలాలు అందేలా ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని పలు సూచనలు చేశారు.



## అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్



**పోచమ్మ మైదానం, మహా :** శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా వరంగల్ 23వ డివిజన్ కొత్తవాడ లోని పలు కమిటీలు ఏర్పాటు చేసిన అమ్మవార్ల మండపాలను 23వ డివిజన్ మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతి సత్యనారాయణ సందర్శించి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ANN తెలుగు

మహా పత్రిక

శనివారం,
హైదరాబాద్
17-10-2026

మహా ప్రత్యేకం



# రణరంగ.. సీమ



నామినేషన్ల తొలిరోజే..
యుద్ధ వాతావరణం
పుంగనూరు, రాయచోటిలో
హింసాత్మక ఘటనలు.
మిథున్ రెడ్డి కాన్వాయ్‌పై దాడి.
రాయచోటిలో వైసీపీ
కార్యాలయానికి నిప్పు.
ధర్మవరం. తిరుపతిలోనూ
రాజకీయ ఘర్షణలు
ఫ్యాక్షన్ సినిమాలను మరిపించిన
సంఘటనలు
గాల్లోకి ఎగిరిన వాహనాలు..
నామినేషన్ కేంద్రాల
ముందే దాడులు

. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన నామినేషన్ల ఘట్టం అడుగడుగునా దాడులు, ప్రతిదాడులు, దహనకాండలతో రణరంగాన్ని తలపించింది. అన్నమయ్య జిల్లా పుంగనూరు, రాయచోటి, శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో చోటుచేసుకున్న భీకర ఘర్షణలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. పల్లెపోరు పండుగ వాతావరణంలో జరగాల్సి ఉండగా, రాజకీయ పార్టీల శ్రేణుల మధ్య చెలరేగిన ఆధిపత్య పోరు చివరకు ప్రాణాల మీదకు తెచ్చే స్థాయికి చేరింది. ఎగిసిపడుతున్న మంటలు, గాల్లోకి పేలుతున్న తూటాలు, ధ్వంసమవుతున్న వాహనాలతో ఆయా ప్రాంతాల ప్రజానీకం ప్రాణగుప్పిట్లో బిక్కుబిక్కుమంటూ గడుపుతోంది.

(మహా నెట్ వర్క్ )

**అంతా సినిమాల్లో చూసినట్లే. సుమోలు గాల్లోకి ఎగిరాయి. ప్రత్యర్థుల కార్యాలయాల ముందు వారి వాహనాలు దగ్ధమైపోయాయి. ప్రత్యర్థులు రాకుండా నామినేషన్ కేంద్రాలనే ముట్టడించి కర్రలు, మారణాయుధాలు, వేటకొడవళ్ళతో కాపుకాసిన సంఘటనలు కనిపించాయి. లోపలో శిబిరం.. బయటో శిబిరం. జైలర్ 2 సినిమా రేంజ్ లో హెచ్చరికలు. ఎక్కడికక్కడ బెదిరింపులు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సమరం తొలిరోజు సీన్ ఇది.**

## నామినేషన్ల తొలిరోజే దద్దరిల్లిన రాయలసీమ.

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన రోజే రాయలసీమలోని పలు ప్రాంతాలు అక్షరాలా యుద్ధభూమిగా మారాయి. రాజకీయ పార్టీల కార్యకర్తల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉన్న వాతావరణం ఏకంగా దౌర్జన్యాలకు దారితీసింది. నాయకత్వాన్ని ఎన్నుకునే ఈ పవిత్ర ప్రక్రియలో భౌతిక దాడులు, బెదిరింపులు, కారు చిచ్చులు చోటుచేసుకోవడం ప్రజాస్వామ్య ప్రియులను కలవరపెడుతోంది. పరిస్థితిని అదుపు చేయడానికి పోలీసులు రంగంలోకి దిగినా, మూకదాడుల ఉద్ధృతికి అడుగడుగునా శాంతిభద్రతలు సవాల్‌గా మారాయి.



## ఎన్నికల సంఘం తలుపుతట్టిన వైసీపీ.

రాష్ట్రవ్యాప్తంగా నామినేషన్ల ప్రక్రియలో చోటుచేసుకున్న ఈ దాడులపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో మండిపడింది. తమ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా ప్రతిపక్షాలు భౌతిక దాడులకు, కిడ్నాప్‌లకు పాల్పడుతున్నాయని వైసీపీ నేతలు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. తక్షణమే జోక్యం చేసుకుని అభ్యర్థులకు రక్షణ కల్పించాలని, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా సాగుతున్న ఈ దాడులపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, ఎన్నికల పవిత్రతను కాపాడాల్సిన గురుతర బాధ్యత ఇప్పుడు యంత్రాంగంపైనే ఉంది.

## రాళ్లదాడితో భయపెట్టిన ధర్మవరం

శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలోనూ నామినేషన్ల ఘట్టం రక్తం చిందించింది. వైసీపీ, టీడీపీ, బీజేపీ శ్రేణుల మధ్య తలెత్తిన ఆధిపత్య పోరు తీవ్ర ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాలు రోడ్లపైకి వచ్చి పరస్పరం రాళ్ల వర్షం కురిపించుకోవడంతో నామినేషన్ కేంద్రం వద్ద భీతావహం నెలకొంది. పరిస్థితి చేయిజారిపోతున్న తరుణంలో అదనపు బలగాలతో రంగంలోకి దిగిన పోలీసులు కఠినంగా వ్యవహరించారు. లాఠీలకు పనిచెప్పి ఆందోళనకారులను చెదరగొట్టారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ స్వయంగా ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితులను పర్యవేక్షించి, బందోబస్తును కట్టుదిట్టం చేశారు.

## పుంగనూరులో తారాస్థాయికి ఉద్రిక్తతలు.

పుంగనూరు మున్సిపాలిటీలో చోటుచేసుకున్న ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా భయాందోళనలు రేపాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లోక్‌సభా పక్ష నాయకుడు, రాజంపేట ఎంపీ పి.వి. మిథున్ రెడ్డి తన అనుచరులతో కలిసి నామినేషన్ల కేంద్రానికి వెళ్తున్న సమయంలో ప్రత్యర్థి వర్గాలు మూకుమ్మడిగా దాడికి దిగాయి. ఇనుప రాడ్లు, కర్రలు, రాళ్లతో కాన్వాయ్‌పై విరుచుకుపడటంతో పరిస్థితి క్షణాల్లో అదుపుతప్పింది. నామినేషన్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను సైతం లెక్కచేయకుండా ఆందోళనకారులు చొచ్చుకొచ్చే ప్రయత్నం చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. లాఠీఛార్జి చేసినా గుంపులు చెదరకపోవడంతో ఏకంగా గాల్లోకి కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ భీకర దాడుల్లో ఇద్దరు సీఆర్పీఎఫ్ జవాన్లతో పాటు, ఎంపీ భద్రతా సిబ్బంది గాయపడ్డారు. ఉద్రిక్తతల నడుమ ఎంపీ మిథున్ రెడ్డిని పోలీసులు హుటాహుటిన ఒక ప్రత్యేక గదిలోకి తరలించి, అనంతరం జిల్లా ఎస్పీ ధీరజ్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు నడుమ సురక్షిత ప్రాంతానికి చేర్చారు.

## కారుచిచ్చుతో రగిలిన రాయచోటి.

రాయచోటి పట్టణంలో దౌర్జన్యాలు మరో భయానక రూపాన్ని సంతరించుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సీనియర్ నేత గడికోట శ్రీకాంత్ రెడ్డి కార్యాలయంపై టీడీపీ శ్రేణులు ప్రణాళికాబద్ధంగా దాడి చేసినట్లు తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కార్యాలయం ఆవరణలో ఉన్న వాహనాలపై పెట్రోల్ పోసి నిప్పంటించడంతో పదికి పైగా కార్లు, ద్విచక్రవాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఆకాశన్నంటేలా ఎగసిపడుతున్న మంటలు, దట్టమైన పొగతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. దాడి సమయంలో శ్రీకాంత్ రెడ్డి స్వయంగా కార్యాలయంలోనే ఉన్నట్లు ప్రాథమిక సమాచారం అందడంతో ఉద్రిక్తత మరింత పెరిగింది. ఈ విధ్వంసకాండను తమ కెమెరాల్లో బంధించేందుకు ప్రయత్నించిన మీడియా ప్రతినిధులపైనా దుండగులు దాడికి తెగబడటం క్షేత్రస్థాయిలో ఉన్న అరాచక పరిస్థితులకు అద్దం పడుతోంది.





## జూలూరుపాడును కరువు మండలంగా ప్రకటించాలి

- గోదారి జలాలతో చెరువులు, కుంటలు నింపాలి
- రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్ర కుమార్

**జూలూరుపాడు, మహా**: ఏలీనీనో ప్రభావంతో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతాంగాన్ని అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చంద్ర నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిరిపురపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన మండల కేంద్రంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏసిన పంటలకి రైతులు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన దిగుబడి చేతికి వచ్చే పరిస్థితి లేదని అన్నారు. గోదావరి జలాలతో చెరువులను నింపాలని, రైతులకు కరువు పరిహారం తక్షణమే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో లోటు వర్షపాతం నమోదైన జిల్లాల్లో భద్రాద్రి జిల్లా ఒకటని గుర్తు చేశారు. కావున తక్షణం కరువు ప్రాంతంగా ప్రకటించి ఎకరానికి 30 వేలు నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలో గోదావరి జలాలను అందించే ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని, ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యమైనంత మేరకు గోదావరి జలాలతో చెరువులు, కుంటలను నింపాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రైతులను సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఎస్కె నాగుల్ మీరా, ఎల్లంకి మధు, పోనేకంటి వెంకటేశ్వర్లు, గుండెపిన్ని మధుసూధనరావు, కంచర్ల రాఘవేంద్రరావు, వలమల్ల సామేలు, హలవత్ బద్రు, కొండ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణపల్లికి చెందిన ఇద్దరు యువతులు
## జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపిక

- తెలంగాణ హైకోర్టు ఫలితాల్లో ప్రతిభ చాటిన హారిక, సౌమ్య

**పెద్దపల్లి మహా** : తెలంగాణ హైకోర్టు ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువతులు జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన వేముల లక్ష్మీ వైకుంఠం దంపతుల కుమార్తె వేముల హారిక, చిప్ప లత రాజేశ్వర్ దంపతుల కుమార్తె చిప్ప సౌమ్య న్యాయమూర్తులుగా ఎంపికై గ్రామానికి గర్వకారణంగా నిలిచారు.వీరి తండ్రుల స్వస్థలం బ్రాహ్మణపల్లి కాగా, వృత్తిరీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడి పనిచేస్తున్నారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపిక కావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు చిప్ప భాస్కర్ హారిక, సౌమ్యలను అభినందించారు. భవిష్యత్తులో న్యాయరంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు న్యాయసేవలు అందించాలని ఆకాంక్షించారు.





## అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

- జీఓ 76 కింద దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన పక్కాగా చేపట్టాలి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని భూ రీ సర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా కచ్చితత్వంతో విధులు నిర్వహించాలని సూచించారు. శుక్రవారం ఇల్లందు ప్రాంతంలో పర్యటించిన కలెక్టర్ ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలు, మామిడి గుండాలలో భూ రీ సర్వే పనులు, జీఓ నెంబర్ 76 కింద సింగరేణి భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తులకు సంబంధించి చేపట్టిన క్షేత్రస్థాయి సర్వేను పరిశీలించారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా అక్టోబర్ 15, 16 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల్లో భాగంగా ఇల్లందులోని సింగరేణి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. నూతన ఓటరు నమోదు కోసం ఫారం6 ద్వారా స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి నమోదు ప్రక్రియ పురోగతిని బూత్ స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని ప్రత్యేక శిబిరాల సమయంలో బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సంప్రదింపు నంబర్లు ప్రజలకు అందుబాటులో ఉంచాలని నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అని అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. అనంతరం ఇల్లందు మండలం మామిడి గుండాలలో నిర్వహిస్తున్న భూ రీ సర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే పురోగతి భూముల విస్తీర్ణం గతంలో జారీ చేసిన పట్టాలు భూ రికార్డులు సరిహద్దుల నిర్ధారణకు సంబంధించిన వివరాలను సర్వే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామ పరిధిలోని భూములకు సంబంధించి పాత రికార్డులు మ్యాప్‌లను పరిశీలించి గతంలో పట్టాలు జారీ చేసిన భూముల సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. అటవీ రెవెన్యూ భూముల హద్దుల విషయంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు అసైన్డ్ భూములు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి రికార్డుల్లో నమోదు చేయాలని తెలిపారు. బోటి గుంపులో మొత్తం 4,733 ఎకరాల భూమి ఉన్నట్లు, గ్రామ పరిధిలోని 130వ సర్వే నంబరులో సుమారు 4,200 ఎకరాల విస్తీర్ణం ఉన్నట్లు సర్వే సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. భూ సరిహద్దుల నిర్ధారణలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా రికార్డుల ఆధారంగా సర్వే నిర్వహించి నెల రోజుల్లోగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటన సందర్భంగా ఎంపీడీవో ఏపీఎం అందుబాటులో లేకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ పర్యటనకు సంబంధించిన విధుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేస్తూ సంబంధిత అధికారులకు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో జీఓ 76 కింద సింగరేణి భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారి స్థలాల పరిశీలనకు సంబంధించి నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి సర్వేను కూడా కలెక్టర్ పరిశీలించారు. సర్వే నిర్వహణ తీరును స్థలాల వాస్తవ పరిస్థితులను దరఖాస్తుదారుల వివరాల నమోదు ప్రక్రియను సమీక్షించారు. దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత రికార్డులతో సరిపోల్చుకోవాలని అధికారులకు సూచించారు. స్థలాల విస్తీర్ణం సరిహద్దులు వినియోగం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవ వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు నిబంధనలకు అనుగుణంగా ప్రతి దరఖాస్తును పారదర్శకంగా పరిశీలించాలని సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను సంబంధిత రికార్డులతో ధ్రువీకరించి తదుపరి ప్రక్రియను నిబంధనల మేరకు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కాశీరాం, జిపిఓ లక్ష్మీకాంత్, మామిడి గుండాల సర్పంచ్ ఎట్టి రమణ, వివిధ శాఖలకు చెందిన అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వైరు తెగిపడి పాడి గేదె మృతి

- ప్రమాదకరంగా మారిన విద్యుత్ వైర్లు
- బాధిత రైతును ఆదుకోవాలని స్థానికుల డిమాండ్

**కారేపల్లి,మహా:** విద్యుత్ వైరు తెగిపడి పంట పొలంలో మేత మేస్తున్న పాడి గేదె మృతి చెందిన ఘటన కారేపల్లి మండల పరిధిలోని చీమలపాడు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన భాగం వెంకటేశ్వర్లు తన పాడి గేదెలను పంట పొలంలో మేపుతుండగా మధ్యాహ్నం 12 గంటల సమయంలో విద్యుత్ వైరు తెగి కిందపడింది. దీంతో మేత మేస్తున్న గేదెలకు విద్యుత్ వైరు తగలడంతో ఒక పాడి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు లక్ష రూపాయలు విలువచేసే గేదె మృతితో రైతుకు ఆర్థికంగా నష్టం వాటిల్లింది.పాడి గేదెపై ఆధారపడి జీవనం సాగిస్తున్న బాధిత రైతును ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు ఆదుకోవాలని, మృతి చెందిన గేదెకు తగిన పరిహారం అందించి న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా విద్యుత్ శాఖ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లోని విద్యుత్ లైన్లను తనిఖీ చేసి, తెగిపోయే ప్రమాదం ఉన్న వైర్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.





## కంకర రోడ్డుగా మారిన సీసీ రోడ్డు!

- రూ.20 లక్షలతో నిర్మాణం.. ఆరు నెలలకే అధ్వానంగా మారిన వైనం
- నాణ్యతా ప్రమాణాలు పాటించ-లేదని గ్రామస్థుల ఆరోపణలు..!? విచారణకు డిమాండ్?

**పెద్దపల్లి మహా,**: కాల్వశ్రీరాంపూర్ మండలం లో మీర్జంపేట గ్రామంలోని లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన సీసీ రోడ్డు ఆరు నెలలు గడవక ముందే దెబ్బతినడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జంపేట గ్రామంలో హైస్కూల్ నుంచి గౌడ కమ్యూనిటీ హాల్ వరకు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రస్తుతం కంకర తేలి అధ్వానంగా మారిందని ఆరోపిస్తున్నారు. గత ఏప్రిల్‌లో నిర్మించిన ఈ రోడ్డు సరైన క్యూరింగ్ లేకపోవడం, నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే దెబ్బతిన్నదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. సీసీ రోడ్డు కాస్తా కంకర రోడ్డును తలపిస్తుండటంతో నిర్మాణ పనుల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాధనంతో నిర్మించిన రోడ్డు ఇంత తక్కువ సమయంలోనే దెబ్బతింటే సంబంధిత అధికారులు పనులను పర్యవేక్షించిన తీరు ఏమిటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణ సమయంలో అధికారులు నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారా? పనులు పూర్తయిన తర్వాత తనిఖీలు నిర్వహించారా? అన్న సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి?**

మీర్జంపేటలో నిర్మించిన సీసీ రోడ్డు నాణ్యతపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. నిర్మాణ పనుల వివరాలను పరిశీలించి, నాణ్యతా లోపాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, రోడ్డు మరమ్మతులకు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## అటవీ అధికారులకు భద్రత అటవీ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

- అటవీ సిబ్బందిపై దాడులు చేస్తే కఠిన చర్యలు
- పోలీసు, అటవీ శాఖల మధ్య సమన్వయం బలోపేతం చేయాలి
- సీపీ అంబర్ కిషోర్ ఝా



**పెద్దపల్లి మహా** : రామగుండం: అటవీ భూముల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణతో పాటు విధుల్లో ఉన్న అటవీ అధికారులకు భద్రత కల్పించడంపై రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రత్యేక దృష్టి సారించారు. పోలీసు, అటవీ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం సీపీ కార్యాలయంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, పెద్దపల్లి డీఎఫ్ఓ కృష్ణ గౌడ్, మంచిర్యాల డీఎఫ్ఓ రాహుల్ జాదవ్, ఏసీపీలతో కలిసి అటవీ అధికారుల భద్రత, అటవీ భూముల పరిరక్షణ, ప్రజలతో అటవీ సిబ్బంది సమన్వయం తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, అటవీ ప్రాంతాల్లో నివసించే ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అటవీ చట్టాలు, నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అటవీ అధికారులపై దాడులు, బెదిరింపులు, విధులకు ఆటంకం కలిగించే ఘటనలను తీవ్రంగా పరిగణించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. మహిళా అటవీ ఉద్యోగులతో సహా విధుల్లో ఉన్న సిబ్బందికి తగిన భద్రత కల్పించాలని స్పష్టం చేశారు.

**అటవీ సిబ్బందిపై దాడులు చేస్తే కేసులు**

అటవీ అధికారులపై దాడులు చేయడం, విధులకు ఆటంకం కలిగించడం, సిబ్బందిని అక్రమంగా నిర్బంధించడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, అధికారులను బెదిరించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం తక్షణమే కేసులు నమోదు చేయాలని సీపీ ఆదేశించారు. ఇప్పటికే నమోదైన కేసులను సమీక్షించి, నిష్పక్షపాతంగా దర్యాప్తు పూర్తి చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**రిజర్వ్ ఫారెస్ట్ భూములకు రక్షణ**

మొక్కల పెంపకం, అటవీ సరిహద్దుల నిర్ధారణ, ఆక్రమణల నుంచి విముక్తి కల్పించిన రిజర్వ్ ఫారెస్ట్ భూముల పరిరక్షణ వంటి కార్యక్రమాలకు అవసరమైన పోలీసు బందోబస్తు కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ అటవీ సంరక్షణ కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా పోలీసు, అటవీ అధికారులు క్షేత్రస్థాయిలో పరస్పర సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. అటవీ భూముల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహించరాదని, అన్ని స్థాయిల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీపీ సూచించారు. క్యాంపైన్ నిధులపై ప్రతికూల ప్రభావం పడకుండా ప్రభుత్వ కార్యక్రమాలను సజావుగా కొనసాగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ కె. శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ గోపి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మంచిర్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రమోదరావు, లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి, చెన్నూర్ రూరల్ సీఐ కృష్ణ, డీసీఎఫ్ సర్వేశ్వర్, ఎఫ్‌డీఓలు కాగజ్‌నగర్ రామమోహన్, జన్నారం విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కాలువల ద్వారా సాగునీటి సరఫరాపై పరిశీలన

**చందపల్లి ప్రధాన కాలువను పరిశీలించిన ప్రభుత్వ విప్ విజయరమణారావు**

పెద్దపల్లి మహా : పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలకు డి83, డి86 ప్రధాన కాలువల ద్వారా సరఫరా అవుతున్న సాగునీటి పరిస్థితిని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శుక్రవారం పరిశీలించారు. పెద్దపల్లి పట్టణంలోని చందపల్లి ప్రధాన కాలువ వద్ద స్థానిక నాయకులతో కలిసి నీటి సరఫరా తీరును సమీక్షించారు.ఈ సందర్భంగా కాలువల ద్వారా సాగునీరు అందుతున్న తీరును పరిశీలించి, రైతులకు సాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన అవసరంపై దృష్టి సారించారు. ఆయా నియోజకవర్గాల పరిధిలోని రైతులకు సాగునీరు సక్రమంగా అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు.



## కొత్తూరు సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంపు

**3.15 నుంచి 5 ఎంవీఏకు పెంపు.. రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా**

**పెద్దపల్లి మహా :** ధర్మారం: రాబోయే రబీ సీజన్, వేసవిలో పెరగనున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కొత్తూరు గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 3.15 ఎంవీఏ నుంచి 5.0 ఎంవీఏకు పెంచారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ఛార్జ్ చేసి రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంపుతో రైతులు ఎదుర్కొంటున్న లోవోల్టేజీ సమస్యలు తగ్గనున్నాయని ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. వ్యవసాయ మోటార్లు నాణ్యమైన వోల్టేజీతో మెరుగ్గా పనిచేసేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. రాబోయే వ్యవసాయ సీజన్‌లో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఈ చర్య దోహదపడుతుందని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డీఈటీ బాలయ్య, డీఈ రాజబ్రహ్మాచారి, ఎంఆర్‌టీ డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏడీఈ వెంకట రమణయ్య, ఎంఆర్‌టీ ఏఈ రాజమల్లయ్య, ఏఈ మునిందర్, లైన్ ఇన్‌స్పెక్టర్ రాజయ్య మరియు ఇతర విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## పరిశుభ్రతలో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి రెండు అవార్డులు

**పెద్దపల్లి మహా :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పరిశుభ్రతలో ఉత్తమ గుర్తింపు సాధించింది. ఆసుపత్రికి పరిశుభ్రత విభాగంలో నగదు పురస్కారంతో పాటు రెండు అవార్డులు లభించడంతో ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా శుక్రవారం పెద్దపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీధర్, ఆర్ఎంఓను ప్రభుత్వ విప్ విజయరమణారావు అభినందించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత ప్రమాణాలను మెరుగుపరచడం, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్యులు, సిబ్బంది కృషి అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో సేవలందిస్తూ ప్రభుత్వ ఆసుపత్రికి మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## మెడికల్ షాపులపై ఆకస్మిక తనిఖీలు

- ప్రిస్క్రిప్షన్ లేకుండా నియంత్రిత మందులు విక్రయిస్తే కఠిన చర్యలు
- ఎన్టీపీసీ పరిధిలో నార్కోటిక్, డ్రగ్స్ నిరోధక శాఖ, సీఐఎస్ఎఫ్ విజిలెన్స్ బృందాల తనిఖీలు



**పెద్దపల్లి మహా** : ఎన్టీపీసీ: వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా నియంత్రిత ఔషధాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ బి. శ్రీనివాసరావు నేతృత్వంలో ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మెడికల్ షాపుల్లో నార్కోటిక్, డ్రగ్స్ నిరోధక శాఖ, సీఐఎస్ఎఫ్ విజిలెన్స్ బృందాలు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా ట్రామడాల్, టాపెంటడాల్, నైట్రాజెపామ్, ప్రెగాబాలిన్, జోల్పిడెమ్, అల్ప్రాజోలం, కోడిన్‌తో కూడిన దగ్గు సిరప్‌ల విక్రయాలకు సంబంధించిన రికార్డులు, వైద్యుల ప్రిస్క్రిప్షన్లు, సేల్స్ రిజిస్టర్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఔషధ చట్టాలు, నిబంధనలకు అనుగుణంగానే మందుల విక్రయాలు జరుగుతున్నాయా అనే అంశంపై తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పిట్ట శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, నియంత్రిత మందులను చెల్లుబాటు అయ్యే వైద్యుల ప్రిస్క్రిప్షన్‌తోనే నిబంధనల ప్రకారం విక్రయించాలని మెడికల్ షాపుల యజమానులు, సిబ్బందికి సూచించారు. మందుల విక్రయాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, అనధికారికంగా నియంత్రిత లేదా నిషేధిత ఔషధాలను విక్రయించడం, సరఫరా చేయడం వంటి చర్యలకు పాల్పడరాదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో పెద్దపల్లి జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పిట్ట శ్రవణ్ కుమార్, నార్కోటిక్/టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ దీకొండ రమేష్, సీఐఎస్ఎఫ్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి. ప్రసాద్ రెడ్డి (ఆర్ఐ), ఎస్ఐ ఆర్.ఎస్. యాదవ్, హెడ్ కానిస్టేబుల్ బి. మురళీకృష్ణతో పాటు నార్కోటిక్ సిబ్బంది పాల్గొన్నారు.



## మహిళా కానిస్టేబుల్ అఖిలకు ఘనంగా శ్రీమంతం

- **మహిళా సిబ్బంది విధి నిర్వహణ అభినందనీయం**
- **శ్రీమంతం నిర్వహించి మానవత్వం చాటుకున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ రమేష్**

**ఆదిభట్ల అక్టోబర్ 16 మహా:** పోలీస్ స్టేషన్‌లో మహిళా సిబ్బంది విధి నిర్వహణ ఎంతో అభినందనీయమని, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రమేష్ పేర్కొన్నారు. ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ, ప్రజలకు సేవలు అందించిన మహిళా కానిస్టేబుల్ అఖిలకు, ఆదిబట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రమేష్ శ్రీమంతం నిర్వహించి, మానవీయతను చాటుకున్నారు. గర్భవతిగా ఉన్న మహిళా కానిస్టేబుల్ అఖిలకు సంప్రదాయబద్ధంగా చీర, సారె అందజేసిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఆమెను ఆశీర్వదించారు.. విధి నిర్వహణలో నిరంతరం సేవలందించిన మహిళా సిబ్బంది పట్ల కుటుంబ సభ్యుల మాదిరి ఆప్యాయతను చూపిస్తూ, పోలీస్ శాఖలో మానవీయ విలువలకు ప్రాధాన్యతనిచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎస్. రమేష్ మాట్లాడుతూ, ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో మహిళా సిబ్బంది విధి నిర్వహణ ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. పురుషులతో సమానంగా మహిళా సిబ్బంది ప్రతి విభాగంలోనూ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని, బందోబస్తు విధులతో పాటు పోలీస్ స్టేషన్ రోజువారీ కార్యకలాపాల్లోనూ కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళా సిబ్బంది సేవలను గుర్తించి, వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐలు, ఏఎస్ఐలు, కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.



## ఎల్‌నినో ప్రభావం వల్ల భూగర్భ జలాల కొరత

- **ఆరుతడి పంటల సాగు వైపు రైతులు మొగ్గు చూపాలి....**
- **సర్పంచ్ కోటేశ్వర్ గౌడ్..**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్ కట్కూరి కోటేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. కోటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం సూపర్ ఏలినో ప్రభావంతో నీటి కొరతతో గ్రామ ప్రజలు రైతులు ఇబ్బంది పడనున్నారు. పాలమాకుల గ్రామంలో ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలి, ఆరుతడి పంటల సాగు: వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను ఎంచుకోవాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల కొరత ఏర్పడుతున్నందున వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులను అప్రమత్తం చేస్తున్నారు. ముఖ్యంగా రబీ (యాసంగి) సీజన్‌లో ఎక్కువ నీరు అవసరమయ్యే వరి వంటి పంటల సాగుకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.



## గాయత్రీ ఆశ్రమంలో సామూహిక అక్షరాభ్యాసాలు

దమ్మపేట ,మహా : విజయదశమి ఉత్సవాలలో భాగంగా ఆరవ రోజు సరస్వతీ దేవి అవతారం లో శ్రీ దుర్గామాతా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. స్థానికంగా ఉన్న శ్రీ గాయత్రీ సంజీవని ఆశ్రమ వ్యవస్థాపకులు పూజ్యశ్రీ ప్రేమ్ సుస్థిర మూర్తిజీ ఆధ్వర్యంలో ప్రతిరోజు గాయత్రీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం అమ్మవారి కి అత్యంత ప్రీతి పాత్రమైన సరస్వతి దేవి అవతారం ,జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం కావడంతో చిన్నారులకు సామూహికంగా అక్షరాభ్యాసాలు జరిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. వందల సంఖ్యలో మహిళా భక్తులు తరలివచ్చారు.

# ఈనెల 24న ఛలో...హైదరాబాద్!సిఐటియు..

- **మల్టీపుల్ డేస్ ధర్నా జయప్రదం చేద్దాం!**
- **సిఐటియు జిల్లా అధ్యక్షులు జే రుద్రకుమార్**
- **గోడ పత్రికను విడుదల చేసిన సిఐటియు నాయకులు**



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 16 మహా:** ఈనెల 24న ఛలో... హైదరాబాద్, ధర్నా ర్యాలీ గోడ పత్రికను ఇబ్రహీంపట్నం పాషా నరహరి స్మారక కేంద్రంలో సిఐటియు ఇబ్రహీంపట్నం మున్సిపల్ కన్వీనర్ చింత పట్ల ఎల్లేషా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న, జిల్లా అధ్యక్షులు జే రుద్రకుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కార్మికుల శ్రమను దోచుకునే కంపెనీలకు మద్దతుగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం, ఉద్యోగం, సామాజిక భద్రత, ప్రైవేట్ రంగ సంస్థల పరిరక్షణ, పి.ఆర్.సి అమలు, డి.ఎ పెంపు, ప్రభుత్వ ఇచ్చిన హామీల అమలుపై, ఈనెల 24 25 26 తేదీలలో హైదరాబాదు లోని ఇందిరాపార్క్ వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ధర్నా చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా చలో హైదరాబాద్.. మల్టీపుల్ డేస్ ధర్నా జయప్రదం చేద్దాం! అంటూ కార్మికులకు కర్షకులకు పిలుపునివ్వడం జరిగిందని ఆయన వెల్లడించారు. అక్టోబర్ - 25న.. పారిశ్రామిక రంగ కార్మికులు, సింగరేణి, ఆర్టీసీ, విద్యుత్ ఉద్యోగులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు ఈ యొక్క ధర్నాలో పాల్గొంటారని తెలిపారు. అక్టోబర్ - 26న.. స్కీమ్ వర్కర్స్, ఔట్ సోర్సింగ్, స్థానిక సంస్థలు, యూనివర్సిటీలు, మెడికల్ ఉద్యోగులు, పెన్షనర్లు, బీడీ, బిల్డింగ్, ట్రాన్స్‌పోర్ట్, హమాలీ కార్మికులు, వివిధ రంగాల ఉద్యోగులు, కార్మికులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి కవిత, జిల్లా ఉపాధ్యక్షులు జెగదీష్, స్వప్న, వీరయ్య, కిషన్ పెంటయ్య, రాజు జిల్లా సహాయ కార్యదర్శులు, చింత పట్ల ఎల్లేశ, , ఆలేటి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు

# పట్టా, అసైన్డ్ భూములకు సమాన నష్టపరిహారం పై అభ్యంతరం

- **పట్టాలు ఉన్న రైతులకు 1200 గజాల నుంచి 1400 గజాల భూమి ఇవ్వాలి...**
- **మల్కారంలో కాన్సెంట్ అవార్డును అడ్డుకున్న**
- **బాధిత రైతులు**
- **భూములు గుంజుకుంటే రైతులు ఎట్లా బతకాలి....**



**రాజేంద్రనగర్ మహా ;** పట్టాలున్న రైతులకు నష్టపరిహారంగా ప్రభుత్వం అసైన్ రైతులతో సమానంగా 800 గజాల పరిహారాన్ని పట్టాదారు రైతులు వద్దన్నారు.గతంలో అసైన్డ్ భూముల రైతులకు 500 గజాల ఇస్తానన్న ప్రభుత్వం నేడు పట్టాదారులు తో సమానంగా ఎనిమిది వందల గజాల భూమి ఇవ్వడాన్ని పట్టా భూములు గల రైతులు హర్షం వ్యక్తం చేశారు. పట్టాలు ఉన్న రైతులకు 800 గజాల నుంచి 1200 గజాల భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. పట్టాదారులు రైతులతో సమానంగా అసలు భూమి రైతులకు పెంచినప్పుడు పట్టాదారులకెందుకు పెంచారని అధికారులను ప్రశ్నించారు. పట్టాదారులకు ,అసైన్ భూముల రైతులకు సమాన నష్టపరిహారం , భూమి కేటాయించడం పై శంషాబాద్ మండల పరిధిలోని మల్కారం గ్రామ రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బుద్వేల్ నాచారం రేడియల్ రోడ్డు2 భూ సేకరణ ప్రక్రియలో భాగంగా నష్టపరిహారం చెల్లింపు విషయంపై శంషాబాద్ మండల పరిధిలోని మల్కారం గ్రామపంచాయతీ కార్యాలయంలో భూములు కోల్పోతున్న రైతులతో రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయం డిప్యూటీ తహసిల్దార్ రాజశేఖర్, భరత్ శంషాబాద్ ఆర్ఐ మహిపాల్ రెడ్డి , జి పి ఓ శంకరయ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం మల్కారం గ్రామ రెవెన్యూలో సర్వేనెంబర్ 84 , 88 లలో 178.36 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడం కోసం భూములు కోల్పోతున్న పట్టాదారు , అసైన్డ్ రైతులకు ప్రభుత్వం ఎకరాకు 800 చదరపు గజాల స్థలం ఇవ్వడానికి జీవో జారీ చేసింది. తమ ఇష్ట ప్రకారం రేడియల్ రోడ్డు కోసం భూమి ఇవ్వడానికి ముందుకు వచ్చిన రైతులకు ప్రభుత్వం కన్సెంటు అవార్డు ఇవ్వడానికి నిర్ణయించింది . ఇందులో భాగంగా నష్టపరిహారం లేదా భూమికి బదులుగా భూమి తీసుకోవడానికి అంగీకరించిన రైతుల నుంచి అధికారులు కన్సెంట్ అవార్డు కింద ఒప్పంద పత్రాలు రాయించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కొత్త బిక్షపతి రెడ్డి గ్రామపంచాయతీలో సమావేశానికి హాజరయ్యారు. సర్పంచ్ కి తెలపకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారనీ అధికారులను నిలదీశారు. ప్రభుత్వం రైతులను మోసం చేయడానికి ప్రయత్నం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు కూడా కన్సెంటు అవార్డుకు ఒప్పుకోవద్దని రైతులకు సూచించారు .అయితే పట్టాదారులకు అసైన్ పట్టాదారులకు సమానంగా నష్టపరిహారం లేదా భూమికి బదులు భూమి ఎలా ఇస్తారంటూ పట్టాదారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పట్టాదారులకు 1200 నుంచి 1400 చదరపు గజాల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే భూములు ఇవ్వడానికి ఒప్పుకోమని రైతులు స్పష్టం చేశారు.

# నీటిని ఆదా చేయండి

- ఆహార వ్యర్థాన్ని నివారించండి
- ప్లాస్టిక్ ను తిరస్కరించండి
- వాతావరణ సంరక్షణ మనందరి బాధ్యత
- జమాతే ఇస్లామీ హింద్ సభ్యులు షేక్ అబ్దుల్ బాసిత్



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** నీరు జీవకోటికి దేవుడిచ్చిన గొప్ప వరమని దాని పరిరక్షణ ద్వారా సాటి మానవులకు లాభం చేకూర్చే ప్రయత్నం చేయడమే అసలైన పుణ్య కార్యం అని జమాతే ఇస్లామి హింద్ సభ్యులు షేఖ్ అబ్దుల్ బాసిత్ అన్నారు. పవిత్ర శుక్రవారం సందర్భంగా చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామ పంచాయతీలోని "మస్జిద్ ఏ ఖుబా" ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎల్ నీనో కారణంగా దేశంలోని పలు ప్రాంతాలు తక్కువ వర్షపాతం కారణంగా నీటి కొరతను ఎదుర్కొంటున్న తరుణంలో నీటిని విచక్షణారహితంగా వాడటం తీవ్ర ఆందోళన కలిగించే విషయంగా మారిందని పేర్కొన్నారు. ఇళ్లలో బహిరంగ ప్రదేశాలలో మత సంస్థలలో నీటిని వృధాపోకుండా చూడడం కూడా ఒక పుణ్య కార్యామే అని అన్నారు. పదిహేను వందల సంవత్సరాల క్రితమే ప్రవక్త ముహమ్మద్
పారే సెలయేరు చెంతనే ఉన్న నీటిని వృధా చేయరాదని వాటిలో మలమూత్ర విసర్జన చేయరాదని అంటే కలుషితం చేయరాదని హెచ్చరించారని చెప్పారు. అవసరం లేకుండా చెట్లను నరకడమే కాదు వాటి ఆకులు తేంచడం కూడా పాపమని పరలోకంలో జవాబు చెప్పుకోవలసి ఉంటుందని హెచ్చరించి వాతావరణం పరిరక్షణకు కృషి చేశారని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగం అతిగా వాహన వినియోగం ద్వారా గాలి భూమి నీటి కాలుష్యము పెంచడం వల్ల సాటి మానవుల ఆరోగ్యం దెబ్బతినేలా చేయడం కూడా పాపమే అన్నారు. నమాజ్ రోజా హజ్ లాంటి మతపరమైన బాధ్యత కేవలం వ్యక్తిగత ఆరాధనకే పరిమితం కాదని అందులో సహజ వనరుల పరిరక్షణ బాధ్యతాయుతమైన వినియోగం ఇతరుల సంక్షేమం పట్ల శ్రద్ధ కూడా ఉంటాయని గుర్తు చేశారు. మనకు ప్రాణవాయువును ఇచ్చే ఒక చెట్టు నాటితే దానివల్ల మానవులు పశువులు పక్షులు ఎవరేవరి ప్రయోజనం కలుగుతుందో అన్నేసి పుణ్యాలు మీ ఖాతాలో వ్రాయబడతాయని తెలిపి చెట్లను నాటడం కూడా ఆరాధనే అని చాటి చెప్పిన ప్రవక్త ముహమ్మద్ బాటలో నడుస్తూ పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని కోరారు. నీటిని వృధా చేయకుండా వాడిన నీటిని ఇంకుడు గుంతలలో నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాలు పెంచవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ ఇమామ్ మజ్హర్, అధ్యక్షుడు అజీజ్ ఖాన్, షబ్బీర్, షమీం, సోను బాయ్, మదార్, రఫీ, మున్నా, షఫీ, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.



## క్వార్టర్ల కొరకు కౌన్సిలింగ్ నిర్వహణ

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలో పనిచేసే ఎన్‌సి డబల్యూఏ ఉద్యోగుల కొరకు బర్మాక్యాంప్ నందు నూతనంగా నిర్మించిన ఎంసి ఎండి టైప్ క్వార్టర్లను ఉద్యోగులకు కేటాయించేందుకు శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ నందు కౌన్సిలింగ్ ను నిర్వహించడం జరిగింది. ఈ క్వార్టర్స్ కౌన్సిలింగ్ లో మొత్తం 92 క్వార్టర్లకు గాను 299 మంది ఉద్యోగులు దరఖాస్తులు చేసుకొగా వారి యొక్క అర్హత కేటగిరి పదవిని బట్టి పూర్తి పారదర్శకతతో వారికి క్వార్టర్స్ కౌన్సిలింగ్ ను నిర్వహించి కేటాయించటం జరిగింది. ఈ కార్యక్రమంలో డిజిఎం(పర్సనల్) బి.శివ కేశవరావు, డివైపిఎం కే.సునీల్ కుమార్, డివైఎఫ్ఎం సంధ్యా రాణి, సాయి కిరణ్, జూనియర్ అసిస్టంట్ ఎం.మౌనిక, ఆఫీస్ సిబ్బంది సెక్యూరిటీ సిబ్బంది క్వార్టర్స్ కౌన్సిలింగ్ కు హాజరైన ఉద్యోగులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి ఆలయంలో భవానీల పూజలు

**దమ్మపేట ,మహా :** మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై వేంచేసియున్న శ్రీ అయ్యప్పస్వామి వారి సన్నిధిలో శుక్రవారం భవానీదీక్షా పరులు భవానీలు ప్రత్యేకంగా అమ్మవారి పూజలు చేశారు. అయ్యప్ప ఆలయ పూజారి అవినాష్ ఉపాధ్యాయ్ బ్రహ్మత్వంలో భవానీ దీక్షా స్వాములకు ప్రత్యేక పూజలు గావించారు. ముందుగా సరస్వతీ దేవి అవతారం కావడంతో చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయించారు. భక్తులకు ఆలయకమిటీ చైర్మెన్ పసుమర్తి రామభద్రరావు సమక్షంలో తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రతిరోజు జరిగే కార్యక్రమాలకు భక్తులు తరలిరావాలని ఆయన కోరారు.





# పలు డివిజన్లకు కాంగ్రెస్ కమిటీల ప్రకటన

- **జిల్లాలో కాంగ్రెస్ బలోపితానికి కృషి చేయండి**
- **మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపు**

**జవహర్ నగర్, మహా** : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్, చెంగిచెర్ల, జవహర్ నగర్, చంద్రపురి కాలనీలకు కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయి డివిజన్ కమిటీలను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపితం చేయడం కోసం ప్రజలతో మరింత సన్నిహితంగా పని చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పథకాలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పార్టీ పదవులు బాధ్యతకు ప్రతీకలని ప్రజా సేవే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని తెలిపారు. అనంతరం వివిధ డివిజన్ల ప్రతి నిధులను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, బోడుప్పల్ మాజీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బోడుప్పల్ డివిజన్ అధ్యక్షుడు బొమ్మ కళ్యాణ్, చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షుడు పోగుల దిలీప్ రెడ్డి, జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షుడు శాంతి కోటేష్ గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు, నూతన కమిటీ సభ్యులు ఉన్నారు.



# సమస్యలను పరిష్కరించండి

- ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ మేయర్ మేకల కావ్య
- ఎంఎంసీ కమిషనర్ కు వినతి పత్రం అందజేత

**జవహర్ నగర్, మహా** : నాగారం, జవహర్ నగర్ డివిజన్లో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ల ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు సిసి రోడ్లు, పారిశుద్ధ్య తదితర మౌలిక సమస్యలను పరిష్కరించే దిశగా మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మాజీ మేయర్ మేకల కావ్య బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు కలిసి శుక్రవారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి పలు సమస్యలను వివరించి వినతి పత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఆలూరి సంగీత రాజశేఖర్, పల్లపు రవి, ( తెలంగాణ వీరప్పన్ )బండి నవీన్ గౌడ్ , బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.





# చర్లమూరి కాలువతో ఇల్లు కూలిపోయే ప్రమాదం!

- **ప్రాణనష్టం జరిగే వరకు అధికారులు స్పందించరా?**
- **నిర్లక్ష్యపు అధికారులపై చర్యలు తీసుకోవాలి**
- **జీఎంజీ ఫౌండేషన్ చైర్మన్ గుండ్ల జంగం గౌడ్ డిమాండ్**

అబ్దుల్లాపూర్‌మెట్ అక్టోబర్ 16 మహా: రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, అనాజ్ పూర్ రోడ్డులోని విద్యుత్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న, జీఎంజీ పౌల్ట్రీ చికెన్ షాప్ వెనుక భాగంలో చర్లమూరి కాలువ నుంచి వచ్చే నీరు పక్కకు దారి మళ్లి, ఇల్లు చుట్టూ చేరుతుండటంతో ఇంటి పునాదులు గోడలు నానడంతో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కాలువ నుంచి వచ్చే నీరు ఇళ్ల వైపు రాకుండా, తక్షణ చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోకపోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తోందని జీఎంజీ ఫౌండేషన్ చైర్మన్ గుండ్ల జంగం గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఒక కుటుంబం ప్రాణాలు, ఆస్తులు ప్రమాదంలో పడే పరిస్థితి రావడం బాధాకరమన్నారు.

ప్రాణనష్టం జరిగే వరకు అధికారులు స్పందించరా? అని ఆయన ప్రశ్నించారు. ఇల్లు కూలిపోయిన తర్వాత స్పందించడం కాకుండా, ముందుగానే ప్రమాదాన్ని గుర్తించి నివారణ చర్యలు చేపట్టాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్పష్టం చేశారు.

**ప్రభుత్వానికి జీఎంజీ ఫౌండేషన్ డిమాండ్లు...**

చర్లమూరి కాలువ నుంచి ఇళ్ల వైపు నీరు రాకుండా తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ప్రమాదంలో ఉన్న ఇంటిని రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని గుండ్ల జంగం గౌడ్ డిమాండ్ చేశారు. అలాగే, ఫిర్యాదులు చేసినా స్పందించని బాధ్యులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

**ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించాలి...**

ఇప్పటికైనా ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదంలో ఉన్న కుటుంబానికి రక్షణ కల్పించాలని, నిర్లక్ష్యానికి తావులేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని గుండ్ల జంగం గౌడ్ గట్టిగా డిమాండ్ చేశారు.

# వరంగల్ ఎనుమాముల మార్కెట్లో ధరల మోసం

- **ఇద్దరి వ్యాపారుల లైసెన్సులు రద్దు**
- **అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు**
- **మార్కెట్ చైర్ పర్సన్ ఎర్ర ప్రియాంక**



**ఎనుమాముల మహా :** వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో ధరల విషయంలో కొందరు వ్యాపారస్తులు మోసానికి పాల్పడుతున్నారు. మార్కెట్ యార్డులో ధరల వ్యత్యాసం చూపిస్తూ మార్కెట్ ఫీజు ఎగవేతకు పాల్పడిన ఇద్దరు వ్యాపారుల లైసెన్సులను రద్దు చేస్తూ మార్కెట్ పాలకవర్గం నిర్ణయం తీసుకుంది. 190 బస్తాల మిర్చికి బహిరంగ మార్కెట్లో రూ.34 వేల ధర పలికినప్పటికి రికార్డుల్లో మాత్రం సగానికి సగం తగ్గించి చూపిన వ్యవహారం పై మార్కెట్ పాలకవర్గం గురువారం సమావేశమై చర్యలు తీసుకుంది. కోల్డ్ స్టోరేజీ నుంచి తరలించిన 190 బస్తాల మిర్చికి బహిరంగ మార్కెట్లో పలికిన ధరకు, రికార్డుల్లో చూపిన ధరకు భారీ వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. 105 బస్తాలకు రూ.14,500, మరో 85 బస్తాలకు రూ.15,000 గా నమోదు చేసినట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. మొత్తం 190 బస్తాలకు మార్కెట్ ధర రూ.34 వేలు పలికినప్పటికీ, రికార్డుల్లో తక్కువ ధర చూపడం ద్వారా ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఒక శాతం మార్కెట్ ఫీజును ఎగవేసేందుకు ప్రయత్నించినట్లు మార్కెట్ పాలకవర్గం గుర్తించింది. రైతులకు నష్టం కలిగించేలా వ్యవహరించినా, మార్కెట్ కమిటీ ఆదాయానికి గండి కొట్టే ప్రయత్నం చేసినా ఉపేక్షించబోమని మార్కెట్ చైర్ పర్సన్ ఎర్ర ప్రియాంక హెచ్చరించారు. ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసినట్లు సమాచారం. మార్కెట్ లో ధరల నమోదు, స్టాక్ వివరాలు, ఫీజుల వసూళ్ల పై నిరంతర పర్యవేక్షణ అవసరమని తెలుస్తోంది.



## టెయిల్ కన్వేయర్ పనులు వేగవంతం చేయాలి..

- నాణ్యత, భద్రతలో రాజీ పడొద్దు..
- సింగరేణి డైరెక్టర్ తిరుమలరావు

**మణుగూరు, మహా** : సింగరేణి మణుగూరు ఏరియాలో చేపట్టిన టెయిల్ కన్వేయర్ ప్రాజెక్టు పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సింగరేణి డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం తిరుమలరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మణుగూరు ఏరియాలో పర్యటించిన ఆయన పీకేసీ-2 గని నుంచి కేసీహెచ్‌పీ వరకు నిర్మాణంలో ఉన్న టెయిల్ కన్వేయర్ ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం జీఎం కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రాజెక్టు పురోగతి, బొగ్గు ఉత్పత్తి, రవాణా వ్యవస్థ, భద్రతా చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ పీకేసీ గనిలో ఉత్పత్తయ్యే బొగ్గును కేసీహెచ్‌పీ వరకు వేగంగా, సురక్షితంగా, సమర్థవంతంగా రవాణా చేసేందుకు టెయిల్ కన్వేయర్ ప్రాజెక్టు ఎంతో కీలకమన్నారు. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే బొగ్గు రవాణా సమయం, ఖర్చులు తగ్గడంతో పాటు ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షించిన ఆయన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, భద్రతా నిబంధనలను అమలు చేయాలని స్పష్టం చేశారు. అనంతరం ఫ్యాబ్రికేషన్ యార్డును సందర్శించి పరికరాల తయారీ విధానం, సాంకేతిక సదుపాయాలను పరిశీలించారు. ప్రాజెక్టు పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్, జీఎం (సివిల్) ఆర్ సతీష్‌బాబు, జీఎం (సీఎంపీ) కె శ్రీనివాసులు, ఏరియా ఇంజనీర్ వి మదన్‌నాయక్, పీకేసీ ప్రాజెక్టు అధికారి డి శ్రీనివాసాచారి, ప్రాజెక్టు ఇంజనీర్ పి రామకృష్ణ, డీజీఎం (ఈ అండ్ ఎం) ఆర్‌ఎస్ గౌడ్, డీజీఎం (ఈ అండ్ ఎం) టి శ్రీకాంత్, డీజీఎం (సివిల్) జి శివప్రసాద్, ఏరియా సెక్యూరిటీ అధికారి కె శ్రీనివాస్, సర్వేయర్ నర్సింహారావు తదితర అధికారులు పాల్గొన్నారు.



## సమాచారం ఒకటైతే.... పట్టుబడింది మరొకటి

- అటవీశాఖ అధికారుల పరిశీలనలో బయటపడ్డ గంజాయి
- నాటుతుపాకీ మందుగుండు సామాగ్రి

**దమ్మపేట ,మహా** : అటవీశాఖ అధికారులకు వచ్చిన సమాచారం ఒకటైతే ,ఘటనా ప్రదేశం లో పట్టుబడింది మరొకటి. నాటుతుపాకీ కోసం వెళ్ళిన అధికారులకు నిర్ఘాంతపోయే ఘటన ఎదురైంది. స్థానికుల సమాచారం మేరకు మండల పరిదిలోని అంకంపాలెం పంచాయతీ కొడిశల గూడెం గిరిజన గ్రామంలో ఓ గిరిజనుడు వేటాడుతూ ,వన్యప్రాణులను బలిగొంటున్నాడని ,అతని వద్ద నాటు తుపాకీ ఉందని అధికారులకు అందిన సమాచారం మేరకు శుక్రవారం అతని నివాసంలో అటవీశాఖ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. దాదాపుగా రెండు గంటల పాటు ఇంట్లో నాటుతుపాకీ కోసం తనిఖీలు చేస్తుండగా ముందుగా తుపాకీలో వాడే మందుగుండు సామాగ్రి లభ్యమైనట్లు సమాచారం. అటు తర్వాత ఇంకా శోధిస్తుండగా మూడు ప్యాక్ లలో గంజాయి లభించినట్లు తెలుస్తుంది. పట్టుబడిన గంజాయి దాదాపుగా 5కేజీల వరకు ఉంటుందని అటవీశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తం పట్టుబడిన గంజాయి ని ,నాటు తుపాకీ మందుగుండు సామాగ్రిని అటవీశాఖ రేంజర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దమ్మపేట పోలీసు యసై రాజేష్ కుమార్ కు అప్పగించారు. లభ్యమైన ఆధారాలతో సంబంధిత వ్యక్తి పై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ భద్రయ్య , బీట్ ఆఫీసర్ లు కాంతారావు ,రాజారమేష్ , నరేష్ ,పార్వతి ,బేస్ క్యాంపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రైతుల ముసుగులో.. గోవుల అక్రమ తరలింపు

- -వాహనాన్ని అడ్డుకొని.. గోవులను గోశాలకు తరలించిన స్థానిక యువకులు

**కారేపల్లి, మహా**: రైతుల ముసుగులో.. కొంతమంది వ్యక్తులు గోవులను వాహనంలో అక్రమంగా తరలిస్తుండగా.. స్థానిక యువకులు వాహనాన్ని వెంబడించి అడ్డుకున్న ఘటన కారేపల్లి ఇల్లందు ప్రధాన రహదారిలోని సోలార్ ప్లాంట్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ఖమ్మం ప్రాంతం నుంచి డీసీఎం వాహనంలో సుమారు 15 గోవులను, ఇల్లందు, మహబూబాబాద్ వైపు కొంతమంది వ్యక్తులు తరలిస్తుండగా. . గమనించిన కారేపల్లి యువకులు వాహనాన్ని వెంబడించి, సోలార్ ప్లాంట్ వద్ద అటకాయించారు. ఈ క్రమంలో సమాచారం అందుకున్న ఇల్లందు గో సంరక్షణ సమితి సభ్యులు, కారేపల్లి విశ్వహిందూ పరిషత్తు సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని. . గోవులను తరలిస్తున్న వ్యక్తులను నిడదీశారు. తాము రైతులమని చెప్పుతూ వంతనాలు లేని సమాధానాలతో పాటు, వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో. . గోవులను వాహనంతో పాటు ఖమ్మంలోని గొల్లగూడెం గోశాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో గో సంరక్షణ సమితి సభ్యులు ,విశ్వహిందూ పరిషత్తు సభ్యులు జంగా వెంకటేశ్వర్లు, వైభవ్ మనియార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోనూ రాజకీయాలకు వాడుకోవడం సరికాదు!

- రైతులకు భరోసా ఇవ్వాల్సింది పోయి విమర్శలా?
- బీఆర్ఎస్ వైఖరిపై ఎమ్మెల్యే మట్టా రాగమయి వ్యాఖ్యలు



**సత్తుపల్లి, అక్టోబర్ 16**: మహా : ప్రకృతి పరిణామాలను సైతం రాజకీయ విమర్శలకు వాడుకోవడం సరికాదని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గిన పరిస్థితులను కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరిస్తూ బీఆర్ఎస్ విమర్శలు చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో రైతులకు ధైర్యం చెప్పి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన ప్రతిపక్షం రాజకీయ విమర్శలకే పరిమితం కావడం తగదన్నారు.

**ప్రకృతి పరిస్థితులను రాజకీయాలకు ముడిపెట్టొద్దు**

''వాతావరణ పరిస్థితుల వల్ల ఏర్పడే సమస్యలను ప్రభుత్వ వైఫల్యాలుగా చిత్రీకరించడం ఎంతవరకు సమంజసం కానీ ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పులు ప్రభుత్వాల చేతుల్లో ఉండవని ప్రతిపక్షం గుర్తించాలన్నారు. ప్రకృతి విపత్తుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు అండగా నిలిచి, భరోసా కల్పించడం ప్రభుత్వాల బాధ్యత'' అని మట్టా రాగమయి అన్నారు.

**రైతు క్షేమం ప్రతిపక్షానికి వర్తిస్తుంది..**

''ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ రైతులకు ధైర్యం చెప్పాల్సిన సమయంలో ప్రతి సమస్యకూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బాధ్యురాలిగా చేయడం ఎంతవరకు సమంజసం అని ఎమ్మెల్యే రాగమయి ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్ష బాధ్యతే అయినప్పటికీ ప్రకృతి పరిస్థితులను రాజకీయ విమర్శలకు వాడుకోవడం వలన ప్రజలకు ఒరిగేదేమీ లేదు'' అని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు.

**కరోనా సమయంలో ఇదే వైఖరి అనుసరించారా?**

''కేసీఆర్ హయాంలో కరోనా మహమ్మారి విజృంభించినప్పుడు ఎదురైన విపత్కర పరిస్థితులకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిదే బాధ్యత అని బీఆర్ఎస్‌ను విమర్శించిందా? ప్రకృతి, వాతావరణ పరిస్థితులను రాజకీయాలకు అతీతంగా చూడాల్సిన ప్రతిక్షాలు ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించాల్సిన అంశాలను ప్రశ్నిస్తే ప్రతిపక్షం విలువ పెరుగుతుంది అని..అది మినహా ప్రతి విషయాన్నీ రాజకీయం చేస్తే ప్రజలు హర్షించరు అని ఎమ్మెల్యే రాగమయి పేర్కొన్నారు.రైతులకు కావాల్సింది విమర్శలు కాదు.. పరిష్కారాలు

''ప్రజలకు అండగా నిలవాల్సిన సమయంలో విమర్శలకే పరిమితమైతే ప్రజల్లో విశ్వసనీయత దెబ్బతినే ప్రమాదం ఉంది. రాజకీయాలు చేయాల్సిన అంశాలపై చేయండి. కానీ ప్రతి విషయాన్నీ రాజకీయం చేయకండి. రైతులకు కావాల్సింది రాజకీయ విమర్శలు కాదు.. ధైర్యం, భరోసా, సమస్యలకు పరిష్కారాలు'' అని ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ స్పష్టం చేశారు.

**ఎల్‌నినోపై నిపుణుల గణాంకాలు**

1950 నుంచి 2026 వరకు దేశంలో 16 ఎల్‌నినో సంవత్సరాలు నమోదైనట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు పేర్కొంటున్నాయి. వీటిలో ఏడు సంవత్సరాల్లో భారత రుతుపవనాల వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదైంది. అయితే ఎల్‌నినో ప్రభావం ఉన్న ప్రతిసారీ దేశవ్యాప్తంగా ఒకే విధమైన వర్షపాత పరిస్థితులు ఉండవు. ఇతర వాతావరణ అంశాలు కూడా వర్షాలపై ప్రభావం చూపుతాయి. ఈ నేపథ్యంలో వాతావరణ పరిస్థితులను సమగ్రంగా విశ్లేషించకుండా ప్రతి సమస్యనూ ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరించడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.




## సమస్త జనులు క్రీస్తు దీవెనలతో సుభిక్షంగా ఉండాలి

- కల్వరి చర్చ్ ఆధ్వర్యంలో ఉపవాస దీక్షల సందర్భంగా పాస్టర్ ప్రవీణ్ సిస్టర్ షారోన్ ల వెల్లడి

**బెల్లంపల్లి ,మహా**: సమస్తజనులు సుభిక్షంగా ఉండాలని అందుకోసం కలవరి చర్చ్ ఆధ్వర్యంలో ఉపవాస దీక్షల ఉత్సవాలను నిర్వహించినట్లు పాస్టర్ ప్రవీణ్, సిస్టర్ షారోన్లు సంయుక్తంగా వెల్లడించారు. గురువారం రాత్రి సోమ గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని కల్వరి చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపవాస దీక్షల ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు, బెల్లంపల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం సుకుమారి ప్రదీప్, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకురి రామచందర్, రాష్ట్ర టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ నేతరి స్వామి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముత్తె భూమన్న, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ కాంపల్లి ఉదయ్ హాజరయ్యారు. కార్యక్రమానికి హాజరైన అతిధులకు పాస్టర్ ప్రవీణ్ తో పాటు సిస్టర్ షారోన్లు ప్రత్యేకంగా క్రీస్తు దీవెనలు అందించి భవిష్యత్తులో ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ లోకంలో జనులందరికీ ఏసుక్రీస్తు దీవనలు ఉండాలని, ఏసుక్రీస్తు చూపిన మార్గాన్ని అవలంబించి జీవనం సాగించాలని సూచించారు. ముగింపు ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అసౌకర్యం కలగకుండా మంచిర్యాల డిసిపి భాస్కర్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఏసీబీ కిరణ్ కుమార్ వన్టౌన్ సిఐ శ్రీనివాసరావు, రూరల్ సీఐ హనోక్, తోపాటు మంచిర్యాల సబ్ డివిజన్లోని పోలీసు అధికారులు పటిష్ట బందోబస్తు నిర్వహించి ట్రాఫిక్ ను నియంత్రించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ తో పాటు తెలంగాణ, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుండి లక్షలాదిగా ఉపవాస దీక్షల ముగింపు ఉత్సవానికి జనం తరలి రావడం జరిగింది.



## దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

**బెల్లంపల్లి , మహా:** కాసిపేట మండలం దేవాపూర్ శ్రామిక నగర్‌లోని దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో , దుర్గం మహేందర్ ఆహ్వానం మేరకు బెల్లంపల్లి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య,బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రమణ రెడ్డి,మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాంటేంకి వాసుదేవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోంది వెంకట రమణ,జాడి రామచందర్,ఏనుగు సుధాకర్ రెడ్డి, బోయిని తిరుపతి, మాజీ సర్పంచ్ అజ్మీరా తిరుపతి, ఆదివాసీ నాయకుడు, వార్డు సభ్యుడు ఆత్రం మహేష్, బీఆర్ఎస్ నాయకులు ధారావత్ కైలాస్, హైదర్ ఖాన్, కంపెల్లి వెంకటేష్,ఎం. తిరుపతి,గారే నారాయణ,అమీర్, యువ నాయకులు సుదీర్ తివారి,గంట అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- అందుకు సంస్థ చేస్తున్న కృషి అభినందనీయం
- నవ లిమిటెడ్ సేవలు ప్రశంసనీయం
- భద్రాద్రి జిల్లా డిఇఓ శంభు ప్రసాద్
- నవ మహిళా సాధికార కేంద్రంలో యోగ్యత పత్రాల బహూకరణ
- - వ లిమిటెడ్ కు శిక్షణ పొందిన అభ్యర్థులు జేజేలు



**భద్రాద్రి కొత్తగూడెం, మహా**:మహిళలు ఆర్థికంగా ఎదగడానికి చేస్తున్న కృషి అభినందనీయమని చిత్తశుద్ధితో పాల్వంచ నవ లిమిటెడ్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని భద్రాద్రి జిల్లా డిఇఓ శంభుప్రసాద్ అన్నారు. పాల్వంచ నవ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాలలో భాగంగా ఏర్పాటు చేసిన నవ మహిళా సాధికార కేంద్రం నందు టాలీ డిటిపి కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు యోగ్యత పత్రాల బహూకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిఈఓ ఎస్.శంభుప్రసాద్ మాట్లాడుతూ కంప్యూటర్ పరిజ్ఞానాన్ని వినియోగించుకొని మహిళలు భవిష్యత్తులో మరింత ముందుకు వెళ్లాలని ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల కల్పనలో మహిళలు ఆర్థికంగా ఎదగడానికి నవ లిమిటెడ్ చేస్తున్న కృషిని కొనియాడారు. మహిళా సాధికార కేంద్ర ప్రతినిధి ఎం .శ్రీనివాసరావు మాట్లాడుతూ 1975లో నవ భారతి సంస్థ ప్రారంభించిన నాటి నుండి సంస్థ అభివృద్ధితో పాటు పరిసర ప్రాంతాలలో మౌలిక వసతులకు ఆనాడే శ్రీకారం చుట్టిందని తెలిపారు. పరిసర ప్రాంతలలోని ప్రభుత్వ పాఠశాలలో కంటి పరీక్షలు దంత పరీక్షలు నిర్వహించటం జరిగిందని పేర్కొన్నారు. ఈ మహిళా సాధికార కేంద్రంలో ఇప్పటివరకు 5500 మందికి పైగా వివిధ కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా డిటిపిలో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థి సత్య మాట్లాడుతూ నవ మహిళా సాధికార కేంద్రం తమలాంటి వారికి ఎందరికో ఉచిత శిక్షణ అందిస్తూ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందని ఇక్కడ నేర్చుకున్న శిక్షణ ద్వారా చదువుకుంటూనే పార్ట్ టైం జాబ్ చేస్తున్నట్లుగా చెప్పారు. ఈ కార్యక్రమంలో డి.సుధాకర్ హెడ్ సిఎస్ఆర్, పి.రమేష్ డిజిఎమ్ మెకానికల్ ఆపరేషన్స్, నవ భారత్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఏం.వి.కే.ప్రసాద్, నవ మహిళా సాధికార కేంద్రం సిబ్బంది శిరీష, దివ్య, అరుణ విద్యార్థులు పాల్గొన్నారు.



## పరుగు పందెంలో పార్థు పరుగు.. పసిడి గెలుపు!

**60 మీటర్ల పరుగులో జిల్లా ఛాంపియన్‌గా మిరాకిల్ మైండ్స్ విద్యార్థి**

**సత్తుపల్లి, అక్టోబరు 16:మహా** : జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తుపల్లికి చెందిన మిరాకిల్ మైండ్స్ పాఠశాల విద్యార్థి పార్థు సత్తా చాటాడు. ఖమ్మం జిల్లాస్థాయిలో నిర్వహించిన అండర్ 16 బాలుర 60 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. తొమ్మిదో తరగతి చదువుతున్న పార్థు ఈ విజయంతో జిల్లా ఛాంపియన్‌గా నిలిచాడు. ఖమ్మం జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ మీట్ 2026లో భాగంగా అక్టోబరు 15న నిర్వహించిన ఈ పోటీల్లో పార్థు ప్రతిభ కనబరిచి విజయం సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ ఎం. రత్నాకర్ విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ పతకాలు సాధించి పాఠశాలకు, ప్రాంతానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు బూరుగు మురళి, కల్యాణి పార్థును అభినందించారు. విద్యతోపాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్నట్లు పాఠశాల వర్గాలు తెలిపాయి.



## నవరాత్రుల వేళ , వాసవీ అమ్మవారు వెల వెల

దమ్మపేట ,మహా : విజయదశమి సంభరాలు ఈ నెల 11వ తేదీ నుండి ఆరంభమై 20 వ తేదీతో ముగించడం జరుగుతుందనే విషయం అందరికీ తెలిసినప్పటికీ , ఈ నవ రాత్రుల సమయంలో ప్రతి ఒక్కరూ అమ్మవారి ప్రతిరూపమైన విగ్రహాలను ఏర్పాటు చేసుకుని ఉత్సవాలను జరుపుతుంటారు. కానీ ఆర్యవైశ్యుల ఆడబిడ్డ గా కొలవబడు చున్న వాసవీ అమ్మవారికి మాత్రం నిత్యం కనీస పూజలు కూడా అందడం లేదనే ఆరోపణలు మండలంలో వినిపిస్తున్నాయి. కనీసం ఈ నవరాత్రుల సమయంలో నైనా శుక్రవారం రోజుల్లో కూడా కనీస పూజలందుకోకుండా శుక్రవారం వెల వెల బోతూ ' మహా ' ప్రతినిధికి కనిపించడంతో క్లిక్ మనిపించడం జరిగింది. ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం ,ఆడబిడ్డ గా కొలుచుకునే వాసవీ అమ్మను ఒక దేవతగా పూజిస్తూ ,జన్మదిన సంభరాలు ,ఆత్మాహుతి సంభరాలు జరిపే సంప్రదాయం ఉన్నటువంటి ఆర్యవైశ్యులు విజయదశమి నవరాత్రుల సమయంలో వాసవీ మాతను పూజించరా...? కనీస నిత్య పూజలు చేయరా...? ఉత్సవాల పేరుతో వేలవేల రూపాయలు నీళ్ళప్రాయసంగా ఖర్చు చేసే భక్తులు , వాసవీ మాతకు ఖర్చు చేయడం లో వెనుకంజ ఎందుకు వేస్తున్నారనే ఆరోపణలు పలువురు నుండి వినిపిస్తున్నాయి. కేవలం మైకులు ,ఆటలు ,పాటలు ,డాన్సులు , చేయడం కోసమే ఉత్సవాలను జరుపుతున్నారా...? లేక భక్తి పారవశ్యంతో చేస్తున్నారా...? అలా ఐతే అన్నివిధాలుగా అధికులమని చెప్పే ఆర్యవైశ్య మాత వెల వెల బోవడానికి పరోపకారంగా కారకులెవరనే ప్రశ్నలు మండలంలో తరచుగా వినిపిస్తున్నాయి. ఇదే ఆర్యవైశ్య మాతకు కొన్ని పట్టణ ప్రాంతాల్లో అంగరంగవైభవంగా పూజలు , ఉచ్చవాలు జరుపుతుంటారని వార్తలు వస్తున్నాయి. మండలంలో ఎక్కడా వాసవీ మాత విగ్రహం లేని సమయంలో స్వర్గీయ కాంట్రాక్టర్ సుబ్బారావు పట్టుదల వల్లనే అయ్యప్పస్వామి ఆలయంలో వాసవి మాత విగ్రహాన్ని ప్రతిష్ఠించిన విషయం కొందరు గుర్తుచేస్తున్నారు. ముఖ్యంగా మహిళా భక్తులు ఆర్యవైశ్య ఆడబిడ్డ ఐనటువంటి వాసవీమాతను ఆరాధన చేయాలని పలువురు కోరుతున్నారు.



# సింగరేణి కార్మికుల శ్రమను కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటోంది

- **బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్**

**మంచిర్యాల, మహా ప్రతినిధి** : సింగరేణి కార్మికులకు కేవలం 34 శాతం వాటా ఇవ్వడాన్ని ఖండిస్తూ బీజేపీ మంచిర్యాల జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్, జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంకెల గారడీతో సింగరేణి లాభాలను తక్కువ చూపి కార్మికులను మోసం చేస్తోందని ఆరోపించారు. గతేడాది 2.50 లక్షల రూపాయల బోనస్ ఇస్తే, ఈ ఏడాది కేవలం 1.50 లక్షల రూపాయలు ఇవ్వడం దుర్మార్గమని అన్నారు. సింగరేణి నిధులను ఇతర అవసరాలకు వాడుకుంటూ, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు చెల్లించడం లేదని విమర్శించారు. సింగరేణిని బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏటీఎం లా వాడుకుంటున్నాయని మండిపడ్డారు. కార్మికులకు అన్యాయం జరుగుతున్నా జిల్లాలోని ముగ్గురు మంత్రులు, నలుగురు ఎమ్మెల్యేలు, ఎంపీ నోరు మెదపడం లేదని, ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎస్. ఐ.ఆర్. ప్రక్రియలో మరణించిన, డబుల్ ఓట్లు మాత్రమే తొలగిస్తున్నారని, అర్హుల ఓట్లు తొలగించడం లేదని స్పష్టం చేశారు. చెన్నూరులో ఎస్. ఐ.ఆర్. వల్ల ఓటు తొలగిన 10 మందిని చూపించాలని ఎంపీ, మంత్రి వివేకానంద కు సవాల్ విసిరారు. ఇకపోతే గోదావరిఖని సభలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అన్నారు. కిషన్ రెడ్డి చొరవతోనే నైని కోల్ బ్లాక్, తాడిచర్ల2, మణుగూరు డీప్ సైడ్ బ్లాక్ లు సింగరేణికి దక్కాయని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో తాడిచర్ల ఓపెన్ కాస్ట్ ను ప్రైవేట్ సంస్థ ఏ.ఎం.ఆర్ కు అప్పగించి దోచుకున్నారని ఆరోపించారు. సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాలు బయటపెట్టి కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుల ఆంజనేయులు, వంగపల్లి వెంకటేశ్వరరావు, కస్తూరి నాగరాజు, పట్టి వెంకటకృష్ణ, కమలాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# జీడబ్ల్యూఎంసీ ప్రాంగణంలో అంబరాన్నంటిన బతుకమ్మ వేడుకలు

- **పూల సోయగాలతో.. సాంస్కృతిక వైభవంతో బతుకమ్మ సంబరాలు**
- **తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ**
- **కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, కమిషనర్ వెంకన్న**



**కార్పొరేషన్, మహా :** గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు శుక్రవారం సాయంత్రం సంస్థ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా జరిగిన ఈ వేడుకల్లో కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, హన్మకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న దంపతులు, మహిళా ఉద్యోగులు, ఇతర సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లతో లయబద్ధంగా నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. పూల సోయగాలు, జానపద గీతాలు, మహిళల ఆటపాటలతో జీడబ్ల్యూఎంసీ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, బతుకమ్మ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిలో లభించే పూలను పూజిస్తూ, ప్రకృతితో మానవ జీవితానికి ఉన్న అనుబంధాన్ని చాటిచెప్పే విశిష్టమైన పండుగ బతుకమ్మ అని తెలిపారు. బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, మహిళల ఆత్మగౌరవం, ఐక్యత, కుటుంబ అనుబంధాలు, సామాజిక సమైక్యతకు ప్రతిబింబమని అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయాన్ని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడటంతోపాటు మహిళల్లో ఐక్యతా భావాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో ప్రజలు బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకునేలా జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లకు ప్రాధాన్యమిస్తున్నట్లు కమిషనర్ వెంకన్న తెలిపారు. నగర పరిశుభ్రత, రవాణా, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బతుకమ్మ పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ మహిళా ఉద్యోగులు, సిబ్బంది, ఇతర మహిళలు పాల్గొన్నారు.



# వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు..

**ధాన్యలక్ష్మీ దేవిగా అమ్మవారి దివ్య దర్శనం**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం ముచ్చింతల్ శ్రీరామ్ నగర్ లోని సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి ఆధ్వర్యంలో నేత్రపర్వంగా పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో విశేషంగా నిర్వహిస్తూన్నారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారి కృపను పొందుతున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన శుక్రవారం అమ్మవారు అష్టలక్ష్మీ స్వరూపిణిలలో ఒకరైన ధాన్యలక్ష్మీ అలంకారంలో భక్తులకు అభయమిస్తూ దివ్యదర్శనం ప్రసాదించారు. సర్వసమృద్ధిని, ధాన్య సంపదను ప్రసాదించే ధాన్యలక్ష్మీ దేవిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేకంగా లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని అత్యంత నిష్టతో నిర్వహించారు. రుత్వికులు, వేద పండితుల మంత్రోచ్ఛారణలు, వేదనాదాల మధ్య ఈ పూజా కార్యక్రమం నేత్రపర్వంగా సాగింది.



# శుభోదయ కాలనీ ఫేస్2 అధ్యక్షుడిగా తోటకూర సురేష్‌రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

**కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



కుషాయిగూడ, మహా : కుషాయిగూడ డివిజన్. శుభోదయ కాలనీ ఫేస్2 వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా తోటకూర సురేష్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. నూతన కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా బి. కృష్ణచారి, కోశాధికారిగా ఎం. కృష్ణచారి, ఉపాధ్యక్షుడిగా టి. సాయిబాబా గౌడ్, జాయింట్ సెక్రటరీగా ఏ. సుధీర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి. సాయి యాదవ్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా వి. రవీందర్‌చారి, ఎం. సాంబయ్య, సలహాదారులుగా వి. బాలకృష్ణచారి, కే. మధుకర్ వ్యవహరించనున్నారు. కార్యవర్గ సభ్యులుగా ఏ. పురుషోత్తంరెడ్డి, ఎండీ కరీం, ఏ. భాగ్యలక్ష్మి, జి. బిక్షపతి యాదవ్, జి. వినయ్, ఎన్. యాదగిరి, డి. చంద్రయ్య, ఎస్. గణేష్, ఈ. నారాయణ, బి. రమేష్, కే. కవిత, కే. చంద్రమౌళి తదితరులు ఎన్నికయ్యారు.



# అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలి

- **మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్( స్థానిక సంస్థలు) చంద్రయ్య**

**బెల్లంపల్లి ,మహా**: బెల్లంపల్లి పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రయ్య క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు సూచించారు. శుక్రవారం రోజు బెల్లంపల్లి పట్టణంలోని 17వ వార్డు 18వ వార్డులలో ప్రజల సౌకర్యార్థం చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖచ్చితంగా నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కీసర సీఐగా ఎలక్షన్ రెడ్డి నియామకం

**కుషాయిగూడ, మహా :** కీసర పోలీస్ స్టేషన్ సీఐగా ఎలక్షన్ రెడ్డిని నియమిస్తూ మల్కాజిగిరి పోలీసు కమిషనర్ సుమతి ఉత్తర్వులు జారీ చేశారు. కంటోన్మెంట్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన కీసర సీఐగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో కీసర సీఐగా పని చేసిన ఆర్కపల్లి ఆంజనేయులు ఏసీబీ అధికారులకు పట్టుబడటంతో ఆయనను అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. అనంతరం ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి జవహర్‌నగర్ ఏసీపీ చక్రపాణి ఇన్‌ఛార్జి సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కీసర పోలీస్ స్టేషన్‌కు



పూర్తిస్థాయి సీఐగా ఎలక్షన్ రెడ్డిని నియమిస్తూ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన బాధ్యతలు శుక్రవారం చేపట్టారు.



# నిరుపేదలకు ఎన్నారై దామోదర్ యాదవ్ అండ

- **200 మందికి రూ.2 లక్షల విలువైన ఉచిత కంటి అద్దాల పంపిణీ**

**పెద్దపల్లి మహా,ధర్మారం**: నిరుపేదల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఎన్నారై కొలుముల దామోదర్ యాదవ్ ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు అండగా నిలుస్తున్నాయి. ధర్మారం మండలంలోని దొంగతుర్తి, నరసింహులపల్లి గ్రామాలకు చెందిన 200 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, రూ.2 లక్షల వ్యయంతో కంటి అద్దాలను పంపిణీ చేశారు. కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పేదలకు ఆర్థిక భారం లేకుండా పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందజేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్నారై కొలుముల దామోదర్ యాదవ్, స్వర్ణలత దంపతుల చిత్రపటానికి గ్రామస్తులు పాలాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంపై దొంగతుర్తి గ్రామ సర్పంచ్ కొడారి మంగ అభినందనలు తెలిపారు. నిరుపేదలకు అండగా నిలుస్తూ, వారి ఆరోగ్య అవసరాల కోసం దామోదర్ యాదవ్ చేస్తున్న సేవలు మరువలేనివని కొనియాడారు. సేవాభావంతో పేదలకు సహాయం చేస్తున్న దామోదర్ యాదవ్ దంపతులకు భగవంతుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు వైద్య సేవలను చేరువ చేయడంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని గ్రామస్తులు పేర్కొన్నారు.



# పెద్దపల్లిలో 63 మంది లబ్ధిదారులకు రూ.63.07 లక్షల చెక్కుల పంపిణీ

- **చెక్కులు అందజేసిన ప్రభుత్వ విప్ విజయ రమణారావు**

**పెద్దపల్లి మహా**: పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక చేయూతనందించే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా పెద్దపల్లి పట్టణం, మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 63 మంది లబ్ధిదారులకు రూ.63,07,308 ఆర్థిక సాయం అందింది. ఈ మేరకు పెద్దపల్లి పట్టణంలోని ఆర్.కె. గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయ రమణారావు స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. వివాహాల సందర్భంగా పేద కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ పథకాలు తోడ్పడుతున్నాయి అని అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సాయం అందించడంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నిషేధిత జాబితా నుంచి సర్వే నంబరు 84/1ను తొలగించాలి

**తహసీల్దార్‌ను కోరిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా :** మల్లాపూర్ గ్రామ అబాదీ పరిధిలోని సర్వే నంబరు 84/1లో ఉన్న నివాస స్థలాలను నిషేధిత జాబితా నుంచి తొలగించి, స్థానికుల సమస్యలను పరిష్కరించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు ఉప్పల్ మండల తహసీల్దార్ ఫూల్‌సింగ్‌ను కలిసి సమస్యను వివరించారు. సర్వే నంబరు 84/1 పరిధిలో అనేక సంవత్సరాలుగా నివాసం ఉంటున్న స్థానికులు తమ ఆస్తుల రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం, ఇంటి నిర్మాణ అనుమతులు పొందడం, ఆస్తుల బదలాయింపు తదితర అంశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ అబాదీ పరిధిలోని నివాస స్థలాల విషయంలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను పరిగణనలోకి తీసుకుని, నిషేధిత జాబితా నుంచి తొలగించే అంశాన్ని పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై తహసీల్దార్ ఫూల్‌సింగ్ సానుకూలంగా స్పందిస్తూ, సమస్యను పరిశీలించి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు కమిటీ సభ్యుడు ఫైళ్ల ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు బాధితుల దీక్ష విరమణ..

- **113 రోజుల అలుపెరగని పోరాటం, ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం..**
- **రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలతో రంగంలోకి కాంగ్రెస్ నాయకత్వం..**

**మొయినాబాద్ మహా: మహా:** 113 రోజుల పాటు తమ హక్కుల సాధన కోసం వెనక్కి తగ్గకుండా సాగించిన నిరవధిక దీక్ష ఎట్టకేలకు కీలక మలుపునకు చేరుకుంది. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూలోని సర్వే నంబర్ 151కు సంబంధించిన 60 గజాల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక దీక్ష నేటితో 113వ రోజుకు చేరుకుంది. న్యాయం కోసం 113 రోజులుగా సాగుతున్న ఈ పోరాటం ప్రభుత్వ దృష్టికి చేరడంతో, తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేన భీంభరత్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులు దీక్షా శిబిరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా 113 రోజులుగా దీక్ష చేస్తున్న బాధితులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను, డిమాండ్లను తెలుసుకొని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తరఫున చొరవ తీసుకునే దిశగా చర్చలు జరపనున్నారు.113 రోజులుగా ఎండనకా, వాననకా, ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ న్యాయం కోసం పోరాడుతున్న బాధితుల ఆవేదనకు శాశ్వత పరిష్కారం లభించాల్సిన అవసరం ఉంది. దీక్ష విరమణతోనే సమస్య ముగిసినట్లు కాదని, సర్వే నంబర్ 151కు సంబంధించిన సమస్యలకు పూర్తిస్థాయిలో పరిష్కారం లభించినప్పుడే ఈ 113 రోజుల పోరాటానికి నిజమైన న్యాయం జరిగినట్లవుతుందని దీక్ష చేస్తున్న బాధితులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల అధ్యక్షులు, బాధితులు, తదితరులు పాల్గొన్నారు.

# సోదరభావంతో బతుకమ్మ దసరా వేడుకలు జరుపుకోవాలి

- **రాష్ట్ర ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన ఏలే చంద్రశేఖర్**

**వలిగొండ, మహా న్యూస్** : తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను రాష్ట్ర ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్ ఆకాంక్షించారు. బతుకమ్మ దసరా పండుగలు ప్రజల్లో ప్రేమాభిమానాలను పెంపొందిస్తూ ఐక్యతను చాటిచెప్పే పండుగలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఏలే చంద్రశేఖర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ మహిళల జీవితాల్లో ప్రత్యేకమైన ఆనందాన్ని నింపుతుందని ఆడబిడ్డలంతా ఒకచోట చేరి పూల బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సంబరాలు జరుపుకోవడం తెలంగాణ సంస్కృతిలో భాగమని అన్నారు రాష్ట్ర ప్రజలందరూ మహిళలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరియాలని కుటుంబ సభ్యులంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.బతుకమ్మ వేడుకల సందర్భంగా మహిళలు యువతులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. బతుకమ్మల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరస్పరం సహకరించుకోవాలని చిన్నపిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు పండుగ వేడుకలు ప్రశాంతంగా సురక్షితంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.అలాగే విజయానికి ప్రతీకగా జరుపుకునే దసరా పండుగను కులమతాలకు అతీతంగా అన్ని జిల్లాలలో మండలాలలో ప్రజలంతా కలిసిమెలిసి జరుపుకోవాలని అన్నారు. పండుగలు మన మధ్య స్నేహభావాన్ని ఐక్యతను మరింత బలోపేతం చేయాలని గ్రామంలో సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరూ సంప్రదాయాలను గౌరవిస్తూ పరస్పర గౌరవాభిమానాలతో పండుగలను ఘనంగా జరుపుకోవాలని ఏలే చంద్రశేఖర్ కోరారు

# జిల్లా బీజేవైఎం కార్యదర్శిగా శశాంక్ సింగ్ నియామకం

జవహర్ నగర్, మహా : మేడ్చల్ జిల్లా బీజేవైఎం కార్యదర్శిగా శశాంక్ సింగ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శశాంక్ సింగ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి నియామకానికి సహకరించి తనకు ప్రోత్సాహం అందించిన నాయకులకు పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్, మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు విక్రమ్ రెడ్డి, జిల్లా బీజేవైఎం అధ్యక్షులు రాగం అర్జున్, జవహర్ నగర్ బిజెపి అధ్యక్షులు కలికోట కమలాకర్ తదితరులకు పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ తనపై ఉంచిన



నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని యువతను పార్టీ సిద్ధాంతాల వైపు చైతన్య పరుస్తూ యువత అభ్యున్నతికి భారతీయ జనతా పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని శశాంక్ సింగ్ తెలిపారు

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శనివారం, హైదరాబాద్ | 17-10-2026
ANN తెలుగు



### సుకుమార్ కోసం నాలుగేళ్ల నిరీక్షణ..

# శ్రీకాంత్ ఓదెల సినీ ప్రయాణం!



మహా : సినిమా రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోవాలనే లక్ష్యంతో అడుగుపెట్టిన దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. ప్రముఖ దర్శకుడు సుకుమార్ దగ్గర పనిచేయాలనే కోరికతో ఆయన దాదాపు నాలుగేళ్లపాటు ప్రయత్నించినట్లు తాజా ఇంటర్వ్యూలో వెల్లడించారు. చిన్నప్పటి నుంచే సినిమాలపై ఆసక్తి పెంచుకున్న శ్రీకాంత్, 'జగడం' సినిమా చూసిన తర్వాత సుకుమార్ దర్శకత్వ శైలికి ఆకర్షితులయ్యారు. ఆయన వద్ద దర్శకత్వ మెళకువలు నేర్చుకోవాలనే పట్టుదలతో హైదరాబాద్‌కు వచ్చారు. ఎన్నో ప్రయత్నాల అనంతరం సుకుమార్ దృష్టిలో పడే అవకాశం దక్కింది. తన ప్రతిభను నిరూపించుకునేందుకు షార్ట్‌ఫిల్మ్ రూపొందించగా, అది నచ్చడంతో సుకుమార్ దర్శకత్వ బృందంలో పనిచేసే అవకాశం లభించింది. 'నాన్నకు ప్రేమతో', 'రంగస్థలం' చిత్రాల ద్వారా శ్రీకాంత్ సినిమా నిర్మాణంలోని పలు అంశాలను దగ్గరగా నేర్చుకున్నారు. ముఖ్యంగా భారీ చిత్రాల రూపకల్పన, నటీనటుల సమన్వయం, సన్నివేశాల చిత్రీకరణ వంటి విషయాల్లో అనుభవం సంపాదించారు. ఆ అనుభవమే ఆయనను దర్శకుడిగా ఎదిగేందుకు దోహదపడింది. నాని హీరోగా తెరకెక్కించిన 'దసరా' సినిమాతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న శ్రీకాంత్ ఓదెల, ప్రస్తుతం 'ది ప్యారడైజ్' చిత్రంతో ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచుతున్నారు. లక్ష్యం పట్ల పట్టుదల, నేర్చుకోవాలనే తపన ఉంటే అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని ఆయన ప్రయాణం తెలియజేస్తోంది.



### భారతీయ సినిమా సత్తా ప్రపంచానికి చాటాలి.. యశ్

**మహా :** భారతీయ చిత్ర పరిశ్రమ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలంటే భారీ ప్రాజెక్టులను ప్రోత్సహించాలని ప్రముఖ నటుడు యశ్ అభిప్రాయపడ్డారు. దర్శకుడు నితేశ్ తివారీ తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ' బడ్జెట్ పై వస్తున్న విమర్శలకు ఆయన స్పందించారు. బెంగళూరులో జరిగిన ట్రైలర్ విడుదల కార్యక్రమంలో మాట్లాడుతూ, విదేశాల్లో భారతీయ సినిమాలను పరిచయం చేసేటప్పుడు వాటి నిర్మాణ స్థాయి, పెట్టుబడి గురించి ఆత్మవిశ్వాసంతో చెప్పాలని పేర్కొన్నారు. మన సినిమాల సామర్థ్యాన్ని ప్రపంచానికి తెలియజేయడం అవసరమని అన్నారు. 'రామాయణ'కు సుమారు రూ.4,000 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో యశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ మొత్తం కేవలం ఒక భాగానికి సంబంధించినది కాదని, రెండు భాగాల నిర్మాణం, విడుదల, ప్రచార ఖర్చులను కలిపి లెక్కించినదని వివరించారు. అంతర్జాతీయ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకున్నప్పుడు పెట్టుబడితోపాటు ఆదాయ అవకాశాలను కూడా ప్రపంచవ్యాప్తంగా చూడాలని అభిప్రాయపడ్డారు. భారతీయ సినిమా ఎదగాలంటే మనమే మన చిత్రాలను తక్కువ చేసి మాట్లాడకూడదని యశ్ సూచించారు. అంతర్గత విభేదాలకు దూరంగా ఉండి, దేశీయ చిత్ర పరిశ్రమ విజయానికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, సాంకేతిక నైపుణ్యం, సృజనాత్మకతను అంతర్జాతీయ ప్రేక్షకులకు పరిచయం చేయడంలో 'రామాయణ' వంటి భారీ చిత్రాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో యశ్ రావణుడిగా, రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్నారు.

### పర్పుల్ అండ్ గోల్డ్ లుక్‌లో

# మానుషి చిల్లర్..

మహా : అందం, అభిరుచి, విభిన్న ఫ్యాషన్ శైలులతో ఎప్పటికప్పుడు అభిమానుల దృష్టిని ఆకర్షించే మానుషి చిల్లర్ మరోసారి తన ప్రత్యేకమైన వస్త్రధారణతో సందడి చేస్తున్నారు. పర్పుల్, గోల్డ్ రంగుల కలయికతో రూపొందించిన సంప్రదాయ దుస్తుల్లో ఆమె ఎంతో హుందాగా కనిపిస్తున్నారు. పండుగలు, పెళ్లిళ్లు, ప్రత్యేక వేడుకలకు అనువుగా ఉండే ఈ కలర్ కాంబినేషన్ ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. దుస్తులపై అందంగా రూపొందించిన అలంకరణలు, బంగారు రంగు వివరాలు సంప్రదాయ శైలికి మరింత వైభవాన్ని జోడిస్తున్నాయి. దుస్తులకు సరిపోయే ఆభరణాలు, చక్కటి మేకప్, అందమైన హెయిర్‌స్టైల్‌తో మానుషి తన రూపాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకున్నారు. కెమెరా ముందు ఆమె ఇచ్చిన పోజులు ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకునేలా ఉన్నాయి. ముఖ్యంగా సంప్రదాయ వస్త్రధారణలోనూ ఆధునికతను జోడించిన తీరు ప్రత్యేకంగా కనిపిస్తోంది. రంగుల ఎంపిక నుంచి ఆభరణాల అమరిక వరకు ప్రతి అంశంలోనూ స్టైలింగ్‌పై ఆమెకున్న అభిరుచి స్పష్టమవుతోంది.

సాధారణంగా పండుగల సమయంలో సంప్రదాయ దుస్తులకు ప్రాధాన్యం ఇచ్చే మహిళలకు పర్పుల్, గోల్డ్ రంగుల కలయిక మంచి ఫ్యాషన్ ఆలోచనగా నిలుస్తుంది. భారీగా కనిపించే అలంకరణలతో పాటు హుందాతనాన్ని కోరుకునేవారికి ఈ శైలి ఆకర్షణీయమైన ఎంపిక. మానుషి చిల్లర్ 2017లో మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలుచుకుని అంతర్జాతీయ గుర్తింపు పొందారు. ఆ తర్వాత మోడలింగ్‌తో పాటు సినీ రంగంలోనూ అడుగుపెట్టి తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకునే ప్రయత్నం చేస్తున్నారు. వివిధ కార్యక్రమాలు, ఫొటోషూట్లలో ఆమె అనుసరించే ఫ్యాషన్ శైలులు తరచూ చర్చనీయాంశమవుతున్నాయి. పాశ్చాత్య దుస్తులతో పాటు సంప్రదాయ వస్త్రధారణలోనూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. తాజాగా పర్పుల్, గోల్డ్ దుస్తుల్లో ఆమె కనిపించిన తీరు పండుగల ఫ్యాషన్‌పై ఆసక్తి ఉన్నవారిని ఆకర్షిస్తోంది. సంప్రదాయానికి ఆధునికతను జోడిస్తూ అందంగా కనిపించాలనుకునేవారికి మానుషి లుక్ మంచి స్ఫూర్తినిస్తోంది.



### బ్లాక్ అండ్ గోల్డ్ లెహంగాలో

# దక్షా నాగర్కర్..

మహా : తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన నటి దక్షా నాగర్కర్ తన సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకుంటున్నారు. నలుపు రంగు లెహంగాపై బంగారు రంగు ఎంబ్రాయిడరీ డిజైన్‌లు ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ శైలికి ఆధునిక అందాన్ని జోడించిన ఈ దుస్తుల్లో దక్షా ఎంతో హుందాగా కనిపిస్తున్నారు. అందమైన ఆభరణాలు, నుదుటిపై బొట్టు, సహజమైన ముఖ కవళికలు ఆమె రూపానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి. కిటికీ పక్కన తీసిన ఫొటోల్లో ఆమె ఆత్మవిశ్వాసంతో కూడిన పోజులు అభిమానులను ఆకర్షిస్తున్నాయి. సాధారణంగా వేడుకలు, పెళ్లిళ్లు, ప్రత్యేక కార్యక్రమాలకు నలుపు బంగారు రంగుల కలయికతో కూడిన దుస్తులు మంచి ఎంపికగా నిలుస్తాయి. దక్షా ధరించిన లెహంగా కూడా సంప్రదాయ ఫ్యాషన్‌ను ఇష్టపడేవారికి కొత్త స్టైల్ ఆలోచనలను అందిస్తోంది. 'హోరాహోరి', 'హుషారు', 'జాంబీ రెడ్డి', 'రావణాసుర' వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ఈ నటి విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. తాజాగా ఆమె సంప్రదాయ లుక్‌కు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో ఫ్యాషన్ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఆధునికతతో పాటు సంప్రదాయాన్ని ప్రతిబింబించే దుస్తుల ఎంపికలో దక్షా తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.



# రణబలి మూవీ రివ్యూ.. చరిత్రకు పోరాటాల జోడింపు!

**మహా :** విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటించిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబలి' ప్రేక్షకుల ముందుకొచ్చింది. దర్శకుడు రాహుల్ సంకృత్యన్ బ్రిటిష్ పాలన కాలంలో రాయలసీమ ప్రాంతం ఎదుర్కొన్న కరువు, ప్రజల కష్టాలు, వలస పాలకుల దోపిడీ వంటి అంశాలను కథకు ఆధారంగా తీసుకున్నారు. ప్రజల ఆకలి బాధలు, ధాన్యం తరలింపు, అన్యాయానికి వ్యతిరేకంగా ఓ యోధుడు చేసే పోరాటం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. రణబలి పాత్రలో విజయ్ దేవరకొండ తనదైన నటనతో ఆకట్టుకున్నారు. పాత్రకు తగిన శరీర భాష, ఆవేశం, పోరాట సన్నివేశాల్లో ఆయన చూపిన తీవ్రత ప్రత్యేకంగా కనిపిస్తాయి. జయమ్మ పాత్రలో రష్మిక మందన్న తన నటనతో కథకు భావోద్వేగాలను జోడించారు. ఇద్దరి మధ్య సన్నివేశాలు ప్రేక్షకులకు కొంత ఉపశమనాన్ని అందిస్తాయి. బ్రిటిష్ అధికారుల క్రూరత్వాన్ని చూపించిన తీరు, భారీ యాక్షన్ ఘట్టాలు, విజువల్స్ సినిమాకు బలంగా నిలుస్తాయి. అయితే కథనం కొన్ని చోట్ల నెమ్మదిగా సాగడం, ద్వితీయార్థంలో సన్నివేశాలు సాగదీసిన భావన కలిగించడం ప్రతికూల అంశాలు. చారిత్రక నేపథ్యానికి కల్పిత అంశాలను జోడించినప్పటికీ, భావోద్వేగాలను మరింత బలంగా ఆవిష్కరించే అవకాశం ఉంది. సంగీతం, నేపథ్య సంగీతం కొన్ని సన్నివేశాలకు బలాన్నిచ్చాయి. మొత్తంగా భారీ పోరాటాలు, విజయ్ దేవరకొండ నటనను ఇష్టపడే ప్రేక్షకులకు 'రణబలి' ఒకసారి చూడదగిన చిత్రంగా నిలుస్తుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com